## తైక్వాండోలో గిన్నిస్ రికార్డు


2


# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - సోమవారం 10 ఆగష్టు 2026 | సంపుటి: 10 | సంచిక: 217 | పేజీలు: 8+4 | వెల రూ.5


## అప్పన్న కొండపై భక్తజన సందోహం

వేలాది మంది భక్తులకు సాఫీగా స్వామివారి దర్శనం


5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM



# ఆదివాసీల ఆర్థిక అభివృద్ధికి కృషి



**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయవాడలో జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గిరిజనుల ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తూ, వారి ఆర్థిక స్వావలంబన, సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు.**

■ పి.మీరాహుస్సే ఖాన్

**అమరావతి, (మనం ప్రత్యేక ప్రతినిధి):** గిరిజన సమాజానికి అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారని, అందుకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సజీవ సాక్ష్యమని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొనియాడారు. ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఘనంగా జరిగిన 'ప్రపంచ ఆదివాసీ దినోత్సవ' వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజన సాంప్రదాయ నృత్యాలైన కొమ్ము, బంజారా, ధింసా ప్రదర్శనలకు సీఎం స్వయంగా డప్పు కొట్టి, గిరిజన బాలికలతో కలిసి ఉత్సాహంగా అడుగులు వేశారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు, విద్య, వైద్య రంగాల బలోతీకరణే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన ప్రకటించారు. విజయవాడలో నిర్వహించిన గిరిజన దినోత్సవ వేడుకలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరవగా, గిరిజన కళాకారులు తమ సాంప్రదాయ నృత్యాలతో ఘనస్వాగతం పలికారు. గిరిజనుల ఉత్సాహాన్ని చూసి సీఎం స్వయంగా డప్పు చేతబట్టి లయబద్ధంగా వాయించారు. అనంతరం వేదికపై గిరిజన సంక్షేమం, హక్కులు, మరియు వారి సాధికారతపై ప్రత్యేక ప్రసంగం చేశారు. భోగాపురం విమానాశ్రయానికి పేరుమన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్మారకార్థం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టామని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. గిరిజన సంస్కృతిని

...మిగతా 2లో

# జో ఖేలేగా వో ఖిలేగా

## కామన్వెల్త్ విజేతలతో ప్రధాని భేటీ



**ఢిల్లీ, ఆగష్టు 9:** కామన్వెల్త్ గేమ్స్ 2026లో పతకాలు సాధించిన భారత క్రీడాకారులను ప్రధానమంత్రి నరేంద్ర మోఢీ అభినందించారు. ఆదివారం సీడబ్ల్యూజీ పతక విజేతలతో మోడీ సమావేశమై వారి ప్రదర్శనను ప్రశంసించారు. అంతర్జాతీయ వేదికపై దేశానికి ప్రాతినిధ్యం వహించేందుకు వారు చూపిన పట్టుదల, కృషిని కొనియాడారు. దేశంలో క్రీడా సంస్కృతిని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అన్ని క్రీడల్లోని క్రీడాకారులను ప్రోత్సహించాలని.. యువత మరింత మంది క్రీడల వైపు వచ్చేలా వాతావరణాన్ని కల్పించాలని పిలుపునిచ్చారు. జో ఖేలేగా వో ఖిలేగా. భారత్ కు ఎప్పుడూ మద్దతుగా నిలవండి. భారత్ మాతా కీ జై!' అంటూ మోడీ ఇన్స్టాగ్రామ్లో పోస్టు చేశారు. యువత క్రీడల్లో పాల్గొనాల్సిన అవసరాన్ని తెలియజేస్తూ గతంలోనూ

...మిగతా 2లో

# మెడికో ప్రియాంక మృతి పట్ల మంత్రి కందుల దుర్గేష్ దిగ్భ్రాంతి

**సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు బాధితురాలి కుటుంబానికి**

**ఇప్పటివరకు అయిన వైద్య ఖర్చులతో పాటు రూ. 20 లక్షల పరిహారం ప్రకటన**

**కేసు విచారణను వేగవంతం చేసి త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ**



**రాజమహేంద్రవరం,ఆగష్టు,09,(మనం న్యూస్):** సికింద్రాబాద్లో చికిత్స పొందుతూ రాజమహేంద్రవరానికి చెందిన వైద్య విద్యార్థిని ప్రియాంక మృతి చెందడం పట్ల రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ విచారం వ్యక్తం చేశారు. ఈ విచారకర ఘటనను మొదటి నుండి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత

...మిగతా 2లో

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పార్థసారథి



**కలిదిండి, ఆగష్టు 09, (మనం న్యూస్):** ఈ నెల 10న కలిదిండి మండలంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొననున్న మీ భూమి - మీ హక్కు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమం ఏర్పాట్లను రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పరిశీలించారు. హెలిప్యాడ్, ప్రజావేదిక, క్యాడర్ సమావేశం, ట్రాన్స్పోర్ట్, భోజనాలు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు, ఎమ్మెల్యే బడేటి చంటి, మాజీ ఎమ్మెల్యే గంటా మురళి, ముఖ్యమంత్రి కార్యక్రమం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, మాజీ పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ కొత్త నాగబాబు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## 12న సంపూర్ణ సూర్యగ్రహణం

### మన దేశంలో దీని ప్రభావం తక్కువే

**హైదరాబాద్, ఆగష్టు 9:** ఈ నెల 12న అరుదైన సంపూర్ణ సూర్యగ్రహణం ఏర్పడనుంది. ఇదే రోజు ఆషాఢ బహుళ అమావాస్య (చుక్కల అమావాస్య) కూడా కావడం విశేషం. ఈ గ్రహణం భారతదేశంలో కనిపించకపోయినా, ప్రపంచంలోని అనేక దేశాల్లో కనిపిస్తుంది. ఈ ఏడాదిలో సంభవించే తొలి సంపూర్ణ సూర్యగ్రహణం ఇదే కావడం విశేషం. స్పెయిన్, ఐస్లాండ్ దేశాల్లో మాత్రమే సంపూర్ణ సూర్యగ్రహణం ప్రత్యక్షమవుతుంది. కాగా, ప్రపంచంలోని 55 దేశాల్లో పాక్షిక సూర్యగ్రహణం మాత్రమే గోచరిస్తుంది.

ఈ సంపూర్ణ సూర్య గ్రహణంలో చంద్రుడు సూర్యబింబాన్ని పూర్తిగా కప్పివేయడంతో,

...మిగతా 2లో



## ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా ముఖ్యమంత్రి సహాయనిధి

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

5





# మళ్లీ జగన్ సీఎం అయితేనే గిరిజనులకు మంచి రోజులు

## గిరిజనుల ఆత్మగౌరవం కాపాడింది జగనే

వైఎస్సార్సీపీ హయాంలోనే గిరిజనులకు పెద్దపీట

పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు (మైదాన ప్రాంతం) గుండా సురేంద్ర స్పష్టీకరణ

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

కూటమి ప్రభుత్వం గిరిజనులకు వెన్నుపోటు పొడిచింది

గిరిజన నాయకుల తీర్మానం

2

## పార్లమెంటు ముందుకు నేడు కీలక బిల్లులు

**ఢిల్లీ, ఆగష్టు 9:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా నేడు పార్లమెంటులో పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మారుస్తూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా లోక్ సభలో బిల్లును ప్రవేశపెట్టనున్నారు. వివిధ ట్రిబ్యునళ్ల చైర్ పర్సన్లు, సభ్యుల నియామకాలు, సేవా నిబంధనలలో పారదర్శకత, స్వతంత్రతను పెంచేందుకు ట్రిబ్యునళ్ల సంస్కరణల బిల్లు చట్టసభల ముందుకు రానుంది. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ దీనిని ప్రవేశపెడతారు. గనులు, ఖనిజాల అభివృద్ధి, క్రమబద్ధీకరణ

...మిగతా 2లో

# సారూ.. మీరు (రా)వద్దు..

## నల్సార్ స్నాతకోత్సవానికి సీజేఐ వద్దు.. విద్యార్థుల నిరసన



ఆయన్ను పిలవొద్దని 450 మంది విద్యార్థులు సంతకాలు

మా డిమాండ్ ఒప్పుకోకపోతే ఆందోళనలు ఉద్ధృతం చెస్తాం.. విద్యార్థుల హెచ్చరిక

2

# అమెరికా సైన్యాన్ని ఉపసంహరించుకోవాల్సిందే

## హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు కొత్త షరతులు పెట్టిన ఇరాన్



**టెహ్రాన్, ఆగష్టు 9:** హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు ఇరాన్ కొత్త షరతులు విధించింది. అమెరికా తన వైఖరిని మార్చుకోవాలని స్పష్టం చేసింది. ఈ వ్యూహాత్మక ప్రాంతం నుంచి అమెరికా సైన్యాన్ని ఉపసంహరించుకోవాలని తెలిపింది. ఇర్వా యుద్ధాన్ని శాశ్వతంగా ముగించాలని.. దాడుల కారణంగా జరిగిన నష్టానికి పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాలని డిమాండ్ చేసింది. తమ ఆస్తులపై ఉన్న ఆంక్షలను ఎత్తివేయడంతోపాటు, విదేశాల్లో స్తంభింపజేసిన నిధులను బేషరతుగా విడుదల చేయాలని కోరింది. ఇరాన్ నౌకాశ్రయాలపై విధించిన దిగ్బంధనాన్ని ఎత్తివేయాలని పేర్కొంది. ఈ మేరకు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ, సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ మహ్మద్ బాగెర్ జోల్ఘాదర్ ఈ వివరాలు వెల్లడించారు. జూన్ లో తాత్కాలిక

...మిగతా 2లో



# మక్కా ఒప్పందంలో చేరుతున్న ఈజిప్ట్

## వెల్లడించిన తుర్కియే

**కైరో, ఆగష్టు 9:** నాటో తరహా భద్రతను ఏర్పాటు చేసుకోవాలన్న ఆలోచనతో పాకిస్థాన్, సౌదీ అరేబియా, తుర్కియే దేశాలు 'మక్కా సమష్టి రక్షణ ఒప్పందం' కుదుర్చుకున్నాయి. ఇందులో తాజాగా ఈజిప్ కూడా చేరనున్నట్లు తుర్కియే విదేశాంగ మంత్రి వెల్లడించారు. అన్ని విషయాల్లో తమ భాగస్వామిగా ఉండే ఆ దేశం మక్కా ఒప్పందంలోనూ చేరుతుందని తెలిపారు. అయితే తాము ఏ ఒక్క దేశాన్ని లక్ష్యంగా చేసుకోలేదని.. తమను తాము బలోపేతం చేసుకోవాలనే ఉద్దేశంతో దీనిపై సంతకం చేశామని స్పష్టం చేశారు. అంతేకాకుండా ఈ కూటమి మరింత విస్తరించే అవకాశం ఉందని.. భవిష్యత్తులో మరిన్ని దేశాలు తమతో చేతులు కలుపుతాయని

...మిగతా 2లో

## కిమ్ సేనలకు రష్యాలో యుద్ధ శిక్షణ

### ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ

**కీవ్, ఆగష్టు 9:** ఉక్రెయిన్ పై యుద్ధానికి మద్దతుగా తమ సైన్యాన్ని రష్యాకు పంపినట్లు ఉత్తర కొరియా ఇప్పటికే వెల్లడించింది. తాజాగా ఆ దేశం నుంచి మాస్కోకు 50వేల మంది సైనికులను పంపడానికి సన్నాహాలు చేస్తున్నారని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ ఆరోపించారు. మొదట్లో వందల సంఖ్యలో యుద్ధంలో పాల్గొన్న కిమ్ సేనలు.. ప్రస్తుతం వేల సంఖ్యలో కనిపిస్తున్నారని అన్నారు. దాడుల్లో పాల్గొంటూనే వారు యుద్ధ తంత్రాలను అధ్యయనం చేస్తున్నారని.. ఇదిలాగే కొనసాగితే

...మిగతా 2లో

# జో ఖేలేగా వో ఖిలేగా



(మొదటి పేజీ తరువాయి)

ఆయన 'జో ఖేలేగా వో ఖిలేగా' నినాదాన్ని పలుమార్లు ప్రస్తావించిన సంగతి తెలిసిందే. ప్రధానితో సమావేశమైన బాక్సింగ్ స్వర్ణ పతక విజేత సాక్షి చౌదరి ఈ భేటీపై ఆనందం వ్యక్తం చేశారు. 'కామన్వెల్త్ గేమ్స్ పతక విజేతలందరినీ ప్రధానమంత్రి ఆహ్వానించారు. ఆయనను కలవడం ఎంతో గర్వంగా, సంతోషంగా అనిపించింది. ప్రధానమంత్రి చాలా సౌమ్యంగా ఉంటారు. ఆయనతో మాట్లాడటం అద్భుతమైన అనుభవం' అని సాక్షి తెలిపింది.

**బాక్సింగ్‌లో రికార్డు మెడల్స్..**

గ్లాస్గోలో జరిగిన కామన్వెల్త్ గేమ్స్లో భారత పతకాల వేటలో బాక్సింగ్ కీలక పాత్ర పోషించింది. భారత బాక్సర్లు మొత్తం 10 పతకాలు సాధించగా.. అందులో ఏడు స్వర్ణాలు ఉన్నాయి. కామన్వెల్త్ గేమ్స్ చరిత్రలో భారత బాక్సింగ్కు ఇదే అత్యుత్తమ ప్రదర్శనగా నిలిచింది.జ ముఖ్యంగా భారత మహిళా బాక్సర్లు అదరగొట్టారు. ఏడు స్వర్ణాల్లో ఐదు మహిళల ఖాతాలోనే చేరాయి.

# ఆదివాసీల ఆర్థిక అభివృద్ధికి కృషి

(మొదటి పేజీ తరువాయి)

కాపాడటంతో పాటు ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.గిరిజన విద్యార్థులకు మెగా డీఎస్సీ ఉచిత కోచింగ్ ఇసున్నామని, గిరిజన ప్రాంతాల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి వీలుగా ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ పరీక్షల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు సీఎం తెలిపారు. నిరుద్యోగ గిరిజన యువతకు ఉచిత కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేయడమే కాకుండా.. తిరుపతి, విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో ప్రత్యేక స్టడీ సర్కిళ్లను ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.మౌలిక వసతుల కల్పనకు రూ. 50 కోట్లు ఇస్తున్నామని తెలిపారు.గిరిజన తండాలు, గ్రామాల్లో తాగునీరు, రహదారులు, విద్యుత్ సౌకర్యాల కల్పనకు అధిక



ప్రాధాన్యత ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. అల్లూరి సీతారామరాజు, మన్యం జిల్లాల్లో ప్రధాన రహదారుల నిర్మాణ పనులను రూ. 50 కోట్ల వ్యయంతో పూర్తి చేయనున్నట్లు హామీ ఇచ్చారు. అలాగే పాడేరు ఏజెన్సీలో పర్యాటక రంగాన్ని రూ. 10 కోట్లతో అభివృద్ధి చేస్తామని, పాడేరు మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని రూ. 500 కోట్లతో వేగంగా పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు.

**నేడు సీఎం కలిదిండి పర్యటన**

సోమవారం సీఎం చంద్రబాబు ఏలూరు జిల్లా కలిదిండి మండలంలో పర్యటించనున్నారు. 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా 1,090 మంది లబ్ధిదారులకు 2,879 ఎకరాల భూమి పత్రాలను పంపిణీ చేయనున్నారు. అక్కడ రైతులతో ముఖాముఖి, ప్రజా వేదిక మరియు పార్టీ క్యాడర్ సమావేశాల్లో సీఎం పాల్గొంటారు

# అమెరికా సైన్యాన్ని ఉపసంహరించుకోవాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

ఒప్పందంలో హర్మూజ్ జలసంధి విషయంలో కొన్ని అంశాలపై అంగీకారం కుదిరిన సంగతి తెలిసిందే. ఆంక్షల సడలింపు, స్తంభించిన ఆస్తుల విడుదల వంటి అంశాలను తుది ఒప్పందంలో చేర్చాలని నిర్ణయించారు. అయితే ఇప్పుడు ఇరాన్ వైఖరి మారింది. జలసంధిని తెరవాలంటే ఆంక్షల ఎత్తివేత, స్తంభించిన నిధులను వెంటనే విడుదల చేయాలని కోరుతోంది. అమెరికా మాత్రం జలసంధిపై ముందుగా ఒప్పందం కుదరాలని భావిస్తోంది. ఆ తర్వాతే దిగ్బంధనాన్ని ముగించే అంశాన్ని పరిశీలించాలని చూస్తోంది. ఈ నేపథ్యంలో ఇరాన్ తాజా డిమాండ్లపై అమెరికా ఇంకా స్పందించలేదు. ఒమన్‌తో తాము జరుపుతున్న చర్చలు కేవలం నౌకల రాకపోకల సాంకేతిక మార్గాల కోసమేనని.. అమెరికా తమ షరతులు అంగీకరించే వరకు జలసంధి తెరిచే ప్రసక్తే లేదని ఇరాన్ స్పష్టం చేసింది.

# మెడికో ప్రియాంక మృతి పట్ల మంత్రి కందుల దుర్గేష్ దిగ్భ్రాంతి

(మొదటి పేజీ తరువాయి)

తీవ్రంగా పరిగణించిందని ఒక ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు. నిర్లక్ష్యంతో నిండు ప్రాణాన్ని బలితీసుకున్న బాధ్యులెవరినీ విడిచిపెట్టేది లేదని, వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించినట్లు వెల్లడించారు. బాధ్యులకు కఠిన శిక్ష పడేలా సమగ్ర విచారణ జరిపించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పోలీస్ ఉన్నతాధికారులకు స్పష్టమైన సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. మృతురాలు ప్రియాంక కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ. 20 లక్షల పరిహారాన్ని ప్రభుత్వం ప్రకటించినట్లు వెల్లడించారు. అంతేగాక ఇప్పటివరకు ప్రియాంక చికిత్స కోసం అయిన మొత్తం ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు.కేసు విచారణను వేగవంతం చేసి త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. భవిష్యత్తులో ఇటువంటి దురదృష్టకర సంఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన నిబంధనలు అమలు చేస్తామని వెల్లడించారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ఘటనపై తక్షణమే స్పందించి తగిన చర్యలకు ఆదేశించారని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. ప్రియాంక కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ..బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని వేళలా అండగా ఉంటుందని, తగిన న్యాయం చేకూరుస్తుందని మంత్రి కందుల దుర్గేష్ ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.



## తైక్వాండోలో గిన్నిస్ రికార్డు

**హైదరాబాద్, ఆగష్టు 9 :** గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన 'తైక్వాండో లెసన్' ప్రదర్శన గిన్నిస్ వరల్ రికార్డులో చోటు దక్కించుకుంది. ఎంజేఆర్ ఇంటర్నేషనల్ తైక్వాండో అకాడమీ, సుమన్ ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 9 ఏళ్ల చిన్నారుల నుంచి 70 ఏళ్ల వద్ధుల వరకు మొత్తం 533 మంది పాల్గొని, 35 నిమిషాల పాటు వివిధ విన్యాసాలు ప్రదర్శించారు. గతంలో 302 మందితో చేసిన ప్రదర్శనను.. తాజాగా అధిగమించారు. గిన్నిస్ వరల్ రికార్డు పరిశీలకుడు స్వప్నిల్ నిర్వాహకులకు ధ్రువీకరణ పత్రం అందజేశారు.

# కిమ్ సేనలకు రష్యాలో యుద్ధ శిక్షణ

(మొదటి పేజీ తరువాయి)

ఇతర ఆసియా దేశాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. వారు రష్యా ఆధ్వర్యంలో ఆధునిక యుద్ధంలో శిక్షణ పొందుతున్నారని పేర్కొన్నారు.

యుద్ధంలో అనుభవాన్ని పెంచుకున్న అనంతరం.. రష్యా నుంచి లైసెన్సులు పొంది..వారి నుంచి అన్ని రకాల సైనిక పరికరాలను పొందడానికి కిమ్ వ్యూహరచన చేసినట్లు ఆరోపించారు. తమ దేశంపై రష్యా చేసిన దాడుల్లో ఉత్తర కొరియా తయారు చేసిన క్షిపణులు వాడినట్లు తమ సైన్యం కనుగొందని తెలిపారు. ఈ నేపథ్యంలో రష్యాను ఎదుర్కోవడానికి తమకు సహకరించాలని జెలెన్స్కీ దక్షిణ కొరియాను కోరారు. గగనతల రక్షణ వ్యవస్థల విషయంలో దేశం కొరతను ఎదుర్కొంటోందని.. ఆయా రంగాల్లో ఆ దేశం నుంచి మద్దతు పొందాలని భవిస్తున్నట్లు వెల్లడించారు.

యుద్ధంలో ఉక్రెయిన్ కు అంతర్జాతీయ మద్దతు కూడగట్టేందుకు జెలెన్ స్కీ దౌత్యపరమైన ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా సెర్బియా పర్యటనకు వెళ్లారు. ఆ దేశాధ్యక్షుడు అలెగ్జాండర్ వుచిచ్తో భేటీ అనంతరం మాట్లాడుతూ.. యూరోపియన్ యూనియన్లో చేరాలనే ఉమ్మడి లక్ష్యం కోసం ఇరు దేశాలు కలిసి పని చేస్తాయన్నారు. ఉక్రెయిన్ కు మానవతా సహాయం, మౌలిక సదుపాయాలు, ఇంధన రంగానికి సంబంధించిన పరికరాలను అందించడానికి సెర్బియా ప్రభుత్వం అంగీకరించింది.

# మళ్లీ జగన్ సీఎం అయితేనే గిరిజనులకు మంచి రోజులు

**గిరిజన నాయకుల తీర్మానం**

**తాడేపల్లి,ఆగష్టు,09,(మనం న్యూస్):** మళ్లీ జగన్ సీఎం అయితేనే గిరిజనులకు న్యాయం జరుగుతుందని, గత వైఎస్సార్సీపీ హయాంలోనే సంక్షేమం, రాజకీయంగా గిరిజనులకు పెద్ద పీట వేశారని గిరిజన నాయకులు గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్ ను మళ్ళీ సీఎం చేయడానికి గిరిజనులు అందరూ ఏకం కావాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో నాయకులు పిలుపునిచ్చారు. ముందుగా గిరిజన సాంప్రదాయ నృత్యాలు, పాటలతో పార్టీ కార్యాలయంలో సందడి నెలకొంది. వైఎస్సార్సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు (మైదాన ప్రాంతం) గుండా సురేంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి శాసనమండలి సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, లేళ్ల అప్పిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనను గిరిజన నాయకులు వారి సాంప్రదాయంలో ఘనంగా సత్కరించారు. ఆయనతోపాటు సీఈసీ సభ్యులు శేషగిరిరావు, ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కనకారావు, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు నారాయణమూర్తి తదితరులు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం గిరిజన సమరయోధులకు పుష్పాంజలి ఘటించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజన నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుండా సురేంద్ర మాట్లాడుతూ.. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఆదివాసీల హక్కుల పరిరక్షణ, వారి కళలు, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత కలిగిన రోజని పేర్కొన్నారు. గిరిజన బిడ్డల విద్య, వైద్యం కోసం తన ఐదేళ్ల పాలనలో వైఎస్ జగన్ గారు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి కొనియాడారు.



## పార్లమెంటు ముందుకు నేడు కీలక బిల్లులు

(మొదటి పేజీ తరువాయి)

చట్టం-1957కు సవరణలు చేసే బిల్లును కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి సమర్పిస్తారు. ఎన్సీడీసీ చట్టం-1962కు సవరణలు చేస్తూ రూపొందించిన ఈ బిల్లును కూడా అమిత్ షా సభలో ప్రవేశపెట్టనున్నారు.

**రాజ్యసభలో చర్చకు రానున్నవి..**

డిజిటల్ బ్యాంకింగ్ విధానాలకు అనుగుణంగా బ్యాంకింగ్ సాక్ష్యాధారాల చట్టాన్ని ఆధునీకరించే ఈ బిల్లును కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పరిశీలన, ఆమోదం కోసం మూవ్ చేస్తారు. అదే విధంగా పేమెంట్ అండ్ సెటిల్మెంట్ సిస్టమ్స్ యాక్ట్-2007, ఇన్కమ్ టాక్స్ యాక్ట్-2025 లలో అవసరమైన సవరణల కోసం ఈ బిల్లును ఎగువసభ పరిశీలించనుంది.

# 12న సంపూర్ణ సూర్యగ్రహణం

(మొదటి పేజీ తరువాయి)

కొన్ని ప్రాంతాల్లో సుమారు రెండు నిమిషాలకు పైగా సంపూర్ణ చీకటి ఏర్పడుతుంది. అదే సమయంలో సాధారణంగా కనిపించని సూర్యుని బాహ్య వాతావరణమైన 'కరోనా' స్పష్టంగా దర్శనమిస్తుంది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని ఖగోళ శాస్త్రవేత్తలు పరిశోధనలు నిర్వహిస్తారు. ఐరోపాలోని కొన్ని ప్రాంతాల్లో పాక్షిక గ్రహణం కొనసాగుతుండగానే సూర్యాస్తమయం జరుగుతుంది. దీనిని 'గ్రస్తాస్తమయ గ్రహణం' అని పిలుస్తారు.

**భారతదేశంలో ప్రభావం ఉందా?**

ఈ గ్రహణం భారతదేశంలో ఎక్కడా కనిపించదు. అందువల్ల భారతదేశ ప్రజలకు ప్రత్యక్ష గ్రహణ దర్శనం ఉండదు. ధర్మశాస్త్రాలలో ప్రధానంగా దృశ్యగ్రహణమే ఆచారానికి ప్రమాణం. అందువల్ల భారతదేశంలో కనిపించని ఈ గ్రహణానికి సాధారణంగా సూతకం, దేవాలయాల మూసివేత, ఆహార నియమాలు, ప్రత్యేక శాంతులు వంటి ఆచారాలు అవసరం లేదని అనేక పంచాంగ కర్తలు, పండితులు చెబుతున్నారు.

# పారిశ్రామిక వాడలకు కొత్త రూపు

**విద్యుత్, డ్రైనేజీ, ఫెన్సింగ్ పనులకు టెండర్లు**

**హైదరాబాద్, ఆగష్టు 9:** టీజీఐఐసీ ఆధ్వర్యంలో వివిధ పారిశ్రామిక పార్కులు, పరిశ్రమల ప్రాంతాలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించి 8 టెండర్లను ఆహ్వానించారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్ ఖాన్ పేట్ లో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి 11 కేవీ హెచ్టీ విద్యుత్ సరఫరా విస్తరణ పనులకు రూ.1.80 కోట్ల అంచనా విలువతో టెండర్లు పిలిచారు. 2400 కేవీఏ, 3217 హెచ్పీ కనెక్టెడ్ లోడ్కు అనుగుణంగా ఈ పనులు చేపట్టనున్నారు. అలాగే.. నాగర్కర్నూల్ డివిజన్లోని వంగూరు మండలం సర్వారెడ్డిపల్లి గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.2.01 కోట్ల అంచనా వ్యయంతో టెండర్ జారీ చేశారు. ఇందులో 33 కేవీ, 11 కేవీ వీసీబీలు, కంట్రోల్ రూమ్, స్వీచ్యార్డ్ రిటైనింగ్ వాల్, కాంపౌండ్ వాల్ నిర్మాణాలు ఉన్నాయి. సిద్దిపేట జిల్లా వర్గల్లోని 845 సర్వే నంబర్లో ఫేజ్-1లో నిర్మిస్తున్న 549 హౌసింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ యూనిట్లకు 11 కేవీ విద్యుత్ సరఫరా కల్పించేందుకు రూ.99.88 లక్షల అంచనా విలువతో మరో టెండర్ను ఆహ్వానించారు.

**సీతారాంపూర్ ప్రాంతంలో డ్రైనేజీ...**

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సీతారాంపూర్లోని ఇండస్ట్రియల్ పార్క్, యూడీఎల్ పరిధిలోని అంతర్గత రహదారులు, ఇతర రోడ్లకు స్టార్మ్ వాటర్ డ్రెయిన్ల నిర్మాణానికి రూ.11.62 కోట్ల అంచనా వ్యయంతో టెండర్ పిలిచారు. యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం డి.రేపాకలో ప్రతిపాదిత ఇండస్ట్రియల్ పార్క్ చుట్టూ బార్బ్డ్ వైర్ ఫెన్సింగ్ కోసం రూ.1.22 కోట్ల అంచనా వ్యయంతో టెండర్ జారీ చేశారు. అదే జిల్లాలోని ఎం.తుర్కపల్లిలో ప్రతిపాదిత ఇండస్ట్రియల్ పార్కు ఫెన్సింగ్ పనులకు రూ.89.36 లక్షలు కేటాయించారు. సూర్యాపేట జిల్లా హుజూర్నగర్లో ప్రతిపాదిత ఫుడ్ పార్క్/అగ్రికల్చర్ ప్రాసెసింగ్ జోన్ చుట్టూ బార్బ్డ్ వైర్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు రూ.84.30 లక్షల అంచనా వ్యయంతో టెండర్ పిలిచారు. మహబూబ్నగర్ జిల్లాలోని దివిటిపల్లి ఐటీ టవర్, దివిటిపల్లి ఇండస్ట్రియల్ పార్క్ తదితర ప్రాంతాల్లో క్యాసెట్ ఏసీలు, సంప్ మోటార్లు, సీసీటీవీ, యూపీఎస్, డీజిల్ జనరేటర్, ఎల్ఈడీ లైటింగ్, ఫైటింగ్, ఎలక్ట్రికల్ యార్డ్ తదితరాలకు వార్షిక విద్యుత్ మరమ్మతులు, నిర్వహణ పనులకు రూ.41.14 లక్షల అంచనా వ్యయంతో టెండర్ ఆహ్వానించారు. కాగా.. ఈ టెండర్లకు సంబంధించిన బిడ్ డౌన్లోడ్ ప్రక్రియ ఈ నెల 7 నుంచి ప్రారంభమైంది. బిడ్ల సమర్పణకు చివరి గడువు ఆగష్టు 22, 2026 మధ్యాహ్నం 3 గంటల వరకు ఉంది. టెండర్ వివరాలు, బిడ్ డాక్యుమెంట్లను తెలంగాణ ఈ-ప్రొక్యూర్మెంట్ వెబ్సైట్లో పొందుపరిచినట్లు టీజీఐఐసీ తెలిపింది.

# మమతా బెనర్జీ కారుపై దాడి

**బెంగాల్‌లో అధికార, ప్రతిపక్షాల లొల్లి**

**కోల్‌కతా, ఆగష్టు 9:** పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి చేదు అనుభవం ఎదురైంది. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని ఓ టీఎంసీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న ఆమె వాహనాన్ని నిరసనకారులు చుట్టుముట్టారు. ఆమెకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంతటితో ఆగకుండా.. దీదీ కారుపై బురద చల్లడంతోపాటు చెప్పులు, రాళ్లు విసిరినట్లు తెలుస్తోంది. ఈ ఘటనను మమతా బెనర్జీ తీవ్రంగా ఖండించారు. రాష్ట్రం గూండాల చేతుల్లోకి వెళ్లిపోయిందని మండిపడ్డారు. బిర్జు అనే టీఎంసీ కార్యకర్తను ఇటీవల పోలీసులు అరెస్టు చేశారు. పోలీసు కస్టడీలో ఉన్న సమయంలోనే ఆయన మృతి చెందారు. తన భర్తను లాకప్ లో పోలీసులు కొట్టడం వల్లే ప్రాణాలు కోల్పోయాడని ఆయన భార్య ఆరోపించారు. ఈ క్రమంలోనే బిర్జు కుటుంబాన్ని పరామర్శించేందుకు మమత బయల్దేరారు. ఆమె వెంట ఎంపీలు కల్యాణ్ బెనర్జీ, డోలా సేన్ ఉన్నారు. మార్గమధ్యంలో నిరసనకారులు ఆమె వాహనాన్ని లక్ష్యంగా చేసుకున్నారు. ఈ వ్యవహారం కాస్త అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది.

''నా కారుపై చెప్పులు, బురద విసిరారు. రాళ్లు, ఇటుకలతో దాడి చేశారు. నా తల పగిలిపోయి ఉండేది. నేను ఇక్కడే చనిపోయి ఉండేదాన్ని. ఇది ముమ్మాటికీ కుట్రే. నేను వస్తున్నానని పోలీసులకు ముందే చెప్పాను. అయినప్పటికీ.. ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోలేదు. నన్ను లక్ష్యంగా చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గూండాలను వాడుకుంటోంది'' అని ఆమె ఆరోపించారు. అయితే, ఉద్రిక్తతలను రెచ్చగొట్టేందుకే మమత అక్కడికి వెళ్లారని బీజేపీ ఆరోపించింది.

# నేటితో ముగియనున్న సర్ గడువు

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** తెలంగాణలో ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ నేటి(సోమవారం)తో ముగియనుంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నారు. ఇప్పటివరకు 2,64,30,494 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 78.14 శాతం డిజిటలైజేషన్ చేశారు. డిజిటలైజేషన్లో హైదరాబాద్ 58.58 శాతంతో చివరి స్థానంలో ఉంది. మేడ్చల్-మల్కాజిగిరి 63.82 శాతం, రంగారెడ్డి 64.91 శాతం నమోదయ్యాయి. అత్యధిక డిజిటలైజేషన్‌లో యాదాద్రి భువనగిరి 94.30 శాతంతో తొలి స్థానంలో ఉంది. మెదక్ 90.54 శాతం, సూర్యాపేట 90.43 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేశారు. కుమురం భీమ్ ఆసిఫాబాద్లో 89.45 శాతం, జగిత్యాలలో 89.60 శాతం పూర్తి అయింది. రెండుసార్లు గడువు పొడిగించిన హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో డిజిటలైజేషన్ పెరగలేదు.

**రాజధానిలో భారీ మార్పులు..**

రాజధాని హైదరాబాద్ నగరంలో ఓటర్ల సంఖ్యలో భారీ మార్పులు చోటుచేసుకోబోతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సర్వే కారణంగా గ్రేటర్ పరిధిలో ఏకంగా 40 లక్షల ఓట్లు జాబితా నుంచి తొలగిపోయే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. నేటితో ఈ సర్వే కార్యక్రమం ముగియనుండగా, నిన్న, మొన్నటి వరకు ఉన్న సమాచారం ప్రకారం రాజధానిలోని మూడు జిల్లాల పరిధిలో ఉన్న 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 1.14 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో దాదాపు మూడో వంతు ఓట్లు రద్దయ్యే సూచనలు కనిపిస్తుండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ సెలవులు ఉన్నప్పటికీ ఆది, సోమవారాల్లో బూత్ స్థాయి అధికారుల (బీఎల్ఓ) నుంచి ఉన్నతాధికారుల వరకు విధుల్లోనే ఉంటారని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించని




ఓటర్లు ఎవరైనా ఉంటే వెంటనే అందజేయాలని ఆయన సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే పూర్తి చేసి, ఈ నెల 17న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించేందుకు అధికారులు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

**సనత్‌నగర్‌లో సగానికి పైగా ఓట్లు రద్దు..**

ఓట్ల తొలగింపు ప్రభావం దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ఉన్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో ఇది అత్యధికంగా ఉంది. ముఖ్యంగా సనత్నగర్ నియోజకవర్గంలో మొత్తం 2,54,030 ఓట్లు ఉండగా, వాటిలో ఏకంగా 1.16 లక్షల ఓట్లు (45.68%) రద్దయ్యే అవకాశం ఉందని అంచనా. అదేవిధంగా జూబ్లీహిల్స్లో 44.21%, ఎల్బీనగర్లో 42.19%, ఉప్పల్లో 40.05%, మహేశ్వరంలో 40.03% ఓట్లు జాబితా నుంచి తొలగిపోవచ్చని అధికారులు చెబుతున్నారు. అత్యల్పంగా ఇబ్రహీంపట్నంలో 21.43% ఓట్లు రద్దయ్యే అవకాశం ఉంది. రాబోయే రెండు రోజుల్లో ఈ సంఖ్యల్లో స్వల్ప మార్పులు మాత్రమే ఉండొచ్చని భావిస్తున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఉపాధి, ఇతర అవసరాల కోసం ప్రతిరోజూ వేలాది మంది హైదరాబాద్కు వలస వస్తుంటారు. ఇక్కడే స్థిరపడి ఓటరుగా నమోదు చేసుకుంటారు. అయితే, ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఓటరు సర్వే జరుగుతున్న నేపథ్యంలో.. సొంత ఊరితో పాటు హైదరాబాద్లోనూ ఓటు హక్కు ఉన్నవారు తమ ఓటును సొంతూరిలోనే కొనసాగించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

దీంతో నగరంలో ఎన్యుమరేషన్ ఫారాలను చాలామంది అధికారులకు తిరిగి ఇవ్వలేదని తెలుస్తోంది. ఇదే ఓట్ల సంఖ్య భారీగా తగ్గడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. మరోవైపు కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా తమకు ఇప్పటికీ ఎన్యుమరేషన్ ఫారాలు అందలేదని లక్షలాది మంది ఓటర్లు ఆరోపిస్తున్నారు. ఇలాంటి వారంతా ఆన్లైన్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. సోమవారం గడువు ముగిసిన తర్వాత తుది లెక్కలు తేలనుండగా, ఆగస్టు 17న వెలువడనున్న ముసాయిదా జాబితాపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# మక్కా ఒప్పందంలో చేరుతున్న ఈజిప్ట్

(మొదటి పేజీ తరువాయి)

భావిస్తున్నట్లు తెలిపారు. పశ్చిమాసియాలో శాశ్వత శాంతి స్థిరత్వాన్ని తీసుకురావడంలో ఇది కీలక ముందడుగు అని తుర్కియే విదేశాంగ మంత్రి పేర్కొన్నారు.

నాటో తరహా రక్షణ ఒప్పందం చేసుకోవాలన్నది ఇప్పటి ఆలోచన కాదు. 'అరబ్ వసంతం' తర్వాత ఉగ్రవాదానికి వ్యతిరేకంగా 34 ముస్లిం దేశాలు ఒక్కటవ్వాలని సౌదీ అరేబియా పిలుపునిచ్చింది. 2015లో మరోసారి ఈ తరహా ప్రతిపాదనను ఈజిప్ట్ చేసినా.. సార్వభౌమాధికారం, ఇతరత్రా కారణాలతో ముందుకు సాగలేదు. ప్రస్తుతం గల్ఫ్ దేశాలపై దాడులు, పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ ఒప్పందం తెరపైకి వచ్చింది. ఇందులో భాగంగా ఏ ఒక్క దేశంపై దాడి జరిగినా మూడింటిపై జరిగిన దాడిగానే పరిగణిస్తాయి.

ఉమ్మడి సైనిక విన్యాసాలు, రక్షణ దళాలకు ప్రత్యేక శిక్షణ, సాంకేతిక బదిలీ, నిఘా సమాచారం మార్పిడికి ఒప్పందం మార్గం సుగమం చేస్తుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

# తెలంగాణలో పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

**హైదరాబాద్, ఆగష్టు 9:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రాబోయే 24 గంటల్లో పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ మేరకు రాష్ట్రంలోని పలు జిల్లాలకు 'ఎల్లో అలర్ట్' జారీ చేస్తూ హెచ్చరికలు జారీ చేసింది. రాజధాని హైదరాబాద్ తో పాటు కామారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, మెదక్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అలాగే ములుగు, నల్గొండ, నారాయణపేట, సంగారెడ్డి, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నట్లు స్పష్టం చేశారు. వర్షంతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఈదురుగాలులు, ఉరుముల తీవ్రత ఎక్కువ ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ముఖ్యంగా వాహనదారులు, విద్యుత్ స్తంభాలు, చెట్ల కింద నిలబడవద్దని సూచించారు. రైతులు కూడా తమ పంటల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



# మఠం భూముల్లో ఎర్రజెండా నాయకత్వాన పేదలతో గుడిసెలు వేయిస్తాం

- తిరుపతి నగరంలో రౌడీయిజానికి ముగింపు పలకండి!
- 'పేదల భూములను కాపాడండి!'
- 'ప్రభుత్వ భూములను, మఠం భూములను కాపాడలేని రెవెన్యూ మంత్రి...బ
- వెంటనే రాజీనామా చేయాలి-సిపిఐ




**తిరుపతి ఆగస్టు 9 మనం న్యూస్:** 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేక విధానాలకు నిరసనగా కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ) దేశవ్యాప్తంగా పాదయాత్రలు నిర్వహిస్తూ చైతన్యం కల్పిస్తున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ. రామానాయుడు పేర్కొన్నారు. మార్పు కోసం సిపిఐ కార్యక్రమం లో భాగంగా తిరుపతి బైరాగి పట్టెడ పార్క్ నుండి ఆదివారం ఉదయం ప్రారంభమైన యాత్ర నగరానికి,చెందిన ఎంకె నాయుడు కాలనీలో హథీరాంజీ మఠం భూములు ఆక్రమణకు గురై నేడు భవనాలు నిర్మిస్తున్న ప్రదేశంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు..

ఈ మఠం భూముల భూకబ్జాలను ప్రోత్సహించడానికి జిల్లా ఇన్చార్జి మంత్రి, రెవెన్యూ మంత్రి సత్య ప్రసాదే ప్రధాన కారణమని ఆయ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ భూములను, పేదల భూములను కాపాడలేని రెవెన్యూ మంత్రి ఎందుకు న్నారో చెప్పాలన్నారు. తిరుపతి లో ఆయన నేతృత్వంలోనే ఆక్రమణలు ప్రోత్సహిస్తున్నారని తెలిపారు.. ఆక్రమించి నిర్మాణాలు చేపట్టి కోట్లాది రూపాయలు దోచుకున్నారని పేర్కొన్నారు.ఈ మఠం భూములను కాపాడటంలో విఫలమైన అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని అన్నారు.ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే, ఈ భూముల్లో తామూ ఇళ్లు కట్టుకుని,ఆక్రమణలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో వారికి గుణపాఠం చెబుతామని అన్నారు.



## జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ

**తిరుపతి,ఆగష్టు 9 మనం న్యూస్:** నేడు జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## గిరిజనులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు ఆగస్టు 9 మనం న్యూస్:** జిల్లాలోని గిరిజనులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలు -2026, స్థానిక కలెక్టరేట్లో లోని డి ఆర్ డిఎ సమావేశ హాలునందు నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జ్యోతి ప్రజలను గావించి కార్యక్రమాలను ప్రారంభించారు ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొనగా ట్రైనింగ్ కలెక్టర్ వెంకటేష్ , గిరిజన సంక్షేమ అధికారి శివ ప్రసాద్, గిరిజన నాయకులు చిరంజీవులు, జీవీ రమణ, రాజశేఖర్, రవి నాయక్,జిల్లా విజిలెన్స్ మానిటర్ కమిటీ ఎస్సీ ,ఎస్టీ మెంబర్లుమునస్వామి, రాజకుమార్, రఘురాం తదితరులు ,సుగుణమ్మ, దేవరాజులు, రవి, రాఘవాచారి, శీను, పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజనులు తమ పిల్లలను తప్పనిసరిగా చదివించుకోవాలన్నారు. ఆదివాసీ యువత తమ సంప్రదాయ, సాంస్కృతిక మూలాలకు క్రమంగా దూరమవుతున్నాదన్నారు. జిల్లాలో 60 వేల జనాభా గిరిజనులున్నట్లు తెలిపారు. దాదాపు 600 నివాస ప్రాంతాలలో మౌలిక వసతులను గుర్తించామన్నారు.

## జిల్లా స్థాయి పోటీలు ప్రారంభోత్సంలో పాల్గొన్న కలెక్టర్

**తిరుపతి, ఆగస్టు 9 మనం న్యూస్:** తిరుపతి పట్టణంలోని తారకరామ స్టేడియంలో నిర్వహిస్తున్న అమరావతి ఛాంపియన్షిప్-2026 తిరుపతి జిల్లా స్థాయి పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్, శాప్ చైర్మన్ రవి నాయుడు , తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాస్ తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అమరావతి ఛాంపియన్ షిప్ -2026 లో పాల్గొంటున్న క్రీడాకారులకు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనే విధంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రీడా కార్యక్రమంలో పాల్గొంటున్న క్రీడాకారులు స్నేహపూర్వక వాతావరణం లో క్రీడా స్ఫూర్తితో పోటీలలో పాల్గొనాలని తెలిపారు.

ఈ సందర్భంగా శాప్ చైర్మన్ రవి నాయుడు మాట్లాడుతూ, రాష్ట్రంలోని యువ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించడమే అమరావతి ఛాంపియన్షిప్-2026 పోటీల ప్రధాన ఉద్దేశమని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా ఈ పోటీలను అండర్-17, అండర్-23 రెండు వయస్సు విభాగాల్లో, మొత్తం 12 క్రీడాంశాల్లో నిర్వహిస్తున్నామని ఆయన వెల్లడించారు. యువ క్రీడాకారులకు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఈ పోటీలు చక్కటి వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు.



## తక్షణ స్పందనతో పోగొట్టుకున్న ఐఫోన్‌ను గుర్తించిన తిరుపతి పోలీసులు



**తిరుపతి ఆగష్టు 9 మనం న్యూస్:** రష్యాలో మెడిసిన్ చదువుతున్న బెంగళూరుకు చెందిన విద్యార్థిని ఎస్. సుమలత రెడ్డి, తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ నుంచి భవానీనగర్ సర్కిల్ వరకు ఆటోలో ప్రయాణించి అక్కడ దిగారు. అనంతరం తాను ప్రయాణించిన ఆటోలో రూ.73,000 విలువైన ఐఫోన్ 15 పిఆర్ఒను మరిచిపోయినట్లు కమాండ్ కంట్రోల్ రూమ్కు సమాచారం అందించారు.సమాచారం అందిన వెంటనే తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఆధ్వర్యంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బంది తక్షణమే స్పందించి. బాధితురాలు ప్రయాణించిన మార్గంలోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీని పరిశీలించి, ఆమె ప్రయాణించిన ఆటోను గుర్తించారు.

సీసీటీవీ ద్వారా గుర్తించిన ఆటో రిజిస్ట్రేషన్ నంబర్ ఎపి 03 టిహెచ్ 0024 ఆధారంగా ఆటో డ్రైవర్ వివరాలను సేకరించి, వెంకటయ్యను పోలీసులు సంప్రదించారు. పోలీసుల సమాచారంతో ఆటోను తనిఖీ చేసిన డ్రైవర్ అందులో ఐఫోన్ ఉన్నట్లు గుర్తించారు.

వెంటనే ఐఫోన్ను కమాండ్ కంట్రోల్ రూమ్కు తీసుకురావాలని పోలీసులు సూచించగా, డ్రైవర్ ఫోన్ను తీసుకుని కంట్రోల్ రూమ్కు వచ్చారు.

# మైనర్ డ్రైవింగ్‌తో ప్రాణాలకు ముప్పు

- తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి
- మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దు - ప్రమాదాలను నివారించండి
- జిల్లా ఎస్పీ తుషార్ డూడి



**చిత్తూరు ఆగస్టు 9 మనం న్యూస్:** చిత్తూరు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో మైనర్ డ్రైవింగ్ను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించి, వాహనదారులు, తల్లిదండ్రులు విద్యార్థుల్లో అవగాహన కల్పించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు.

2026 జూలై వరకు చిత్తూరు జిల్లాలో మైనర్ డ్రైవర్ల ప్రమేయంతో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 9 ఫేటల్ యాక్సిడెంట్లు, 4 నాన్-ఫేటల్ యాక్సిడెంట్ నమోదయ్యాయి.2025 సంవత్సరంలో మైనర్ డ్రైవర్ల ప్రమేయంతో 11 ఫేటల్ యాక్సిడెంట్, 8 నాన్-ఫేటల్ యాక్సిడెంట్లు నమోదయ్యాయి. మైనర్లతో వాహనాలు నడిపించడం వల్ల ప్రమాదాలే కాకుండా, వారి ప్రాణాలకు మరియు ఇతర రహదారి వినియోగదారుల ప్రాణాలకు కూడా తీవ్ర ముప్పు ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో మైనర్ డ్రైవింగ్ పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఈ-చలాన్లు విధిస్తున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యే లక్ష్యంగా పనిచేయాలి

సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. శ్రీనివాసరావు




**తిరుపతి, ఆగస్టు 9 మనం న్యూస్:** తిరుపతి రాహుల్ ఫంక్షన్ హాల్లో తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు చెందిన డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్ల (డిడిఒ)కు నిర్వహించిన ఎస్ఎన్ఎ-ఎస్ పిఎఆర్ఎస్ఆర్ హెచ్ శిక్షణ కార్యక్రమంలో సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. శ్రీనివాసరావు, ముఖ్య అతిథిగా పాల్గొని పాఠశాల విద్యా నాణ్యత, పాఠశాల నాయకత్వం, విద్యార్థుల సమగ్ర అభివృద్ధిపై దిశానిర్దేశం చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య, సమాన అవకాశాలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో విశ్వాసాన్ని మరింత పెంపొందించే బాధ్యత విద్యాశాఖలోని ప్రతి ఉద్యోగిపై ఉందన్నారు.ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులే విద్యా వ్యవస్థకు బలమైన స్తంభాలు

ఉపాధ్యాయులు తమ జ్ఞానం, అనుభవం, నైపుణ్యాలను పూర్తిస్థాయిలో వినియోగిస్తూ విద్యార్థి కేంద్రిత, అనుభవాత్మక, వినూత్న బోధనా పద్ధతులను అమలు చేయాలని సూచించారు.

# రిజన ప్రాంతాలలో మౌలిక వసతులు, విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట



### తిరుపతి పట్టణంలో గిరిజన భవన్ అధునీకరణకు కృషి చేస్తాం

### జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్

**తిరుపతి, ఆగస్టు 9 మనం న్యూస్:** భారతదేశంలో విభిన్న రకాల ఆదివాసి తెగలు ఉన్నాయని, అనాది కాలము నుండి ఆదివాసిలో కొన్ని తెగలు నవ సమాజంలో ఇమడగలిగినా మరి కొన్ని తెగల వారు ఇంకా అడవులలో జీవిస్తున్నారని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఆదివాసి దినోత్సవం సందర్భంగా ఆదివారం తిరుపతిలోని కచ్చాపి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమాలకు జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరుకాగా స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జెసి, ఆర్ గోవిందరావు,యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా చాలా కొద్ది దేశాల్లో మాత్రమే విభిన్నమైన ఆదివాసి తెగలు ఉన్నాయని, భారత దేశంలో కూడా అనేక గిరిజన తెగలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం ఉన్న నాగరిక ప్రపంచం ఒకప్పుడు ఆదివాసీలుగానే ఉండేవారని తెలిపారు. ఆదివాసీలలో మనోధైర్యం చాలా తక్కువగా ఉంటుందని, వారికి మనోధర్యం పెంచే అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న తెగల వారి సమస్యలు భిన్నంగా ఉంటాయని పేర్కొన్నారు.

## వైసీపీకి నిరుద్యోగులపై ప్రేమ ఉంటే.. నాడు ఎందుకు మాట్లాడలేదు? నేడు ఎందుకు దీక్షలు?

- రవి నాయుడు

**తిరుపతి ఆగస్టు 9 మనం న్యూస్ :** వైసిపికి నిరుద్యోగులపై ప్రేమ ఉంటే నాడు ఎందుకు మాట్లాడలేదని శ్యాప్స్ చైర్మన్ రవి నాయుడు అన్నారు. ఆదివారంతిరుపతి ప్రెస్ క్లబ్లో శాప్ చైర్మన్ రవి నాయుడు మెగా డీఎస్సీ పై మీడియా సమావేశం నిర్వహించాడు

అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీకి నిరుద్యోగులపై నిజమైన ప్రేమ ఉంటే, వారు గతంలో పోరాటాలు చేసినప్పుడు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. డీఎస్సీ అభ్యర్థులపై గతంలో కేసులు నమోదు చేసినప్పుడు స్పందించని వైసీపీ నేతలు.. ఇప్పుడు డీఎస్సీపై ఆందోళనలు చేయడం కేవలం రాజకీయ లబ్ధి కోసమేనని విమర్శించారు.నిన్న కర్నూలు కొండారెడ్డి బురుజు వద్ద ఉపాధ్యాయులు మెగా డీఎస్సీపై తమ అభిప్రాయాలను వెల్లడించి, డీఎస్సీ ప్రక్రియ సక్రమంగా జరిగిందని చెప్పారని రవి నాయుడు గారు తెలిపారు. డీఎస్సీ సక్రమంగా జరిగిందని ఉపాధ్యాయులే చెబుతున్నప్పుడు.. వైసీపీ నేతలు ఎందుకు అనవసర రాద్ధాంతం చేస్తున్నారు? అని ప్రశ్నించారు.



# తెలుగు కీర్తి పతాకలు



నేటి తరానికి భావితరానికి ఎంతో స్ఫూర్తిదాయకంగా ఆదర్శప్రాయంగా ఉండాలని ఉద్దేశంతో ఈ తెలుగు దీపికలలో మొత్తం 50 మంది తెలుగు తేజాలు గురించిన సంక్షిప్త సమాచారం ఉంది. 1841-1899 మధ్య కాలంలో జన్మించిన మహిళామణులు, సంఘ సంస్కర్తలు, నాటకం, కళాసాహిత్య, క్రీడారంగాలలో ప్రముఖులు. రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకులుగా పేరందిన తెలుగు వారి గురించిన సంక్షిప్త సమాచారాన్ని సేకరించి ఒకచోట చేర్చిన వెలుగు రేఖలు ఈ 'తెలుగు దీపికలు'.

ముందుగా డొక్కా సీతమ్మ గారు. వీరి నాన్నగారికి బువ్వన్న గారు అనే మరో పేరు ఉండేదట. అంటే అన్నం పెట్టే పెద్దమనిషి అని జనం పిలుచుకున్నారు. ఆ వారసత్వాన్ని సీతమ్మ గారు కొనసాగించారు. ఆమె కీర్తి బ్రిటిష్ చక్రవర్తి చెవిన పడి ఏడవ ఎడ్వర్డ్ ప్రభువు ఆమెను లండన్ రమ్మని ఆహ్వానించే వరకు సాగింది. ఆంగ్ల ప్రభుత్వం ఢిల్లీలో తిరిగి పట్టాభి షేకం వేడుకలు జరిపినప్పుడు దర్బార్‌హాల్లో ఆమె చిత్రపటాన్ని పెట్టి గౌరవించారు.

కొక్కొండ వెంకటరత్నం పంతులు. వీరు ఆంధ్ర భాషా సంజీవని పత్రికను 20 సంవత్సరాలు పాటు నడిపారు. హాస్యవర్ధిని అనే పత్రికను కూడా నడిపారు ఆంగ్లభాష పదాలను ఉపయోగించకుండా వాటికి సరైన పారిభాషిక పదాలు నిర్మించి వ్యాప్తిలోకి తెచ్చారు.

కందుకూరి వీరేశలింగం గారు దక్షిణ భారత విద్యాసాగరుడుగా ప్రసిద్ధులు. వితంతు శరణాలయాన్ని స్థాపించారు. హితకారిణీ సమాజం అనే సంస్థను స్థాపించి తన యావదాస్తిని దారాదత్తం చేశారు. 1874లో వివేకవర్ధని పత్రికను 1883లో సతీ హిత బోధిని పత్రికను స్థాపించి స్త్రీ అభ్యుదయం కోసం తెలుగులో వ్యాసాలను రాశారు. వీరి సతీమణి కందుకూరి రాజ్యలక్ష్మి గారు భర్తకు తగిన సహచరి.

ధర్మవరం రామకృష్ణమాచార్యులు సుమారు 30 నాటకాలు రాశారు. నాటక ప్రదర్శన కోసం సరస వినోదిని సభ స్థాపించి తద్వారా నాటక ప్రదర్శనలు కవి పండిత సమ్మేళనాలు నిర్వహించి తెలుగుదేశంలో ముందెప్పుడూ లేని గౌరవ స్థానాన్ని నాటకానికి ఆర్జించి పెట్టారు. చక్కటి చిక్కటి సాహిత్య పుష్టి గల రచనలే గాని అందులోని పద్యాలు బహుళ ప్రచారం పొందాయి.

న్యాపతి సుబ్బారావు పంతులుగారు ఉపాధ్యాయునిగా పనిచేస్తూ న్యాయవాద పట్టాను పొందటం అప్పట్లో అరుదైన విషయం. వీరు 'ద హిందూ' జాతీయ ఆంగ్ల దినపత్రికను స్థాపించారు. అప్పట్లో భారత దేశంలో ప్రచురితమయ్యే ఆంగ్ల పత్రికలన్నీ బ్రిటిష్ ప్రభుత్వ కనుసన్నల్లో ఉండేవే. 1907లో వందేమాతర ఉద్యమం సందర్భంగా బిపిన్ చంద్రపాల్ ను రాజమండ్రి ఆహ్వానించి అక్కడ ఉపన్యాసాలు ఇప్పించారు.

ఆదిభట్ల నారాయణదాసు గారు కవిత్వం సంగీతం నాట్యం అనే మూడు రంగాలలోనూ తనకున్న ప్రతిభను జోడించి హరికథ అనే కళను అత్యున్నత శిఖరాలకు కొనిపోయారు. ఈ మూడింటి కలయికకు భక్తి అనే భావం ప్రాణంగా హరికథలు రచించారు.

పానుగంటి లక్ష్మీ నరసింహారావు సాక్షి వ్యాసాలు, కంఠాభరణం రచయితగా ప్రసిద్ధులు. సాక్షి వ్యాసాలు ఆరు సంపుటలుగా నాటకాలు సుమారు 30 వరకు ప్రచురించారు. వారి రచనలన్నింటిలోనూ చలోక్తులు చమత్కారాలు ఉపమానాలు రత్నాలు, ముత్యాలు లాగా వెదజల్లబడి ఉంటాయి.

చిలకమర్తి లక్ష్మీ నరసింహం గారి అసలు పేరు పున్నయ్య. మనోరమ సరస్వతి దేశమాత అనే పత్రికలు నడిపారు. ప్రహసనాలు, నాటకాలు రాశారు. 'సౌందర్య తిలక కర్పూర మంజరి' 'గణపతి' ఆయన ప్రసిద్ధ రచనలు.

కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమైనప్పుడు అప్పటి మారుతున్న పరిస్థితులను రాజకీయ పరిణామాలను తెలుగువారికి అందించాలనే ఉద్దేశంతో 'ఆంధ్ర పత్రిక' దినపత్రికను ప్రారంభించారు. 1924లో 'భారతి' అనే సాంస్కృతిక సాహితీ పత్రికను కూడా ప్రారంభించారు. వీరికి దేశోద్ధారక అనే బిరుదు ఉంది. మహాత్మా గాంధీ వీరి దాతృత్వాన్ని అభినందిస్తూ 'విశ్వదాత' అనుకొని యాడారు.

రఘుపతి వెంకయ్య నాయుడు తెలుగు ప్రజలకు సినిమాను పరిచయం చేసి చలనచిత్ర రంగానికి పితామహుడు అనిపించుకున్నారు. దక్షిణ భారతదేశంలో మొట్టమొదటి సినిమా నిర్మాణ సంస్థ 'స్టార్ ఆఫ్ ది ఈస్ట్' ను స్థాపించారు. భీష్మ ప్రతిజ్ఞ మూగ చిత్రాన్ని నిర్మించారు. 1980వ సంవత్సరంలో వీరి పేరు మీద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సినీ రంగంలో విశేష కృషి చేసిన వారికి అవార్డు ప్రదానం చేస్తున్నారు.

చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రి అవధానాల పరంపరను ఒక వంక కొనసాగిస్తూ మరో వంక ఆంధ్ర నాటక సాహిత్యాన్ని రసవత్తరమైన పాండవ నాటకాలతో సుసంపన్నం చేశారు. పాండవ జననం మొదలు అశ్వమేధం వరకు కథను ఆరు నాటకాలుగా రచించారు.

టంగుటూరి ప్రకాశం పంతులు గారికి రంగస్థలం నక్షత్రం అనే బిరుదు ఉంది. పారిజాతాపహరణంలో సత్యభామ పాత్రను, వీరేశలింగం గారి చమత్కార రత్నావళి లోని స్త్రీ పాత్రను ప్రకాశం గారే ధరించేవారు. నా జీవిత యాత్ర పేరుతో నాలుగు సంపుటాలుగా చక్కని వ్యవహారిక భాషలో తన ఆత్మకథ రాశారు. స్వరాజ్య అనే పత్రికను ముందు ఆంగ్లంలో ఆ తర్వాత తమిళ తెలుగు భాషల్లో నడిపారు.

బండారు అచ్చమాంబ 'ఆప్తులైన పురుషులచే గృహమున నిర్బంధించబడు స్త్రీలు రక్షితరాండ్రు కాదు. ఏ స్త్రీలు తమ యొక్క ఆత్మను తామే కాపాడుకొందురో వారే సురక్షితురాండ్రు' అంటూ 1901 లోనే 'అబలా సచ్చరిత్ర రత్నమాల' అనే మహత్తర గ్రంధాన్ని రచించారు. వీరి ధన త్రయోదశి కథ వాస్తవానికి మొదటి తెలుగు కథ. తెలుగులో మొట్టమొదటి స్త్రీల చరిత్రను రాసిన తొలి మహిళగా అచ్చమాంబ చరిత్రలో చోటు చేసుకున్నారు.

కొమర్రాజు వెంకట లక్ష్మణరావు. వీరు అజ్ఞానాంధకారంలో నిద్రాణమైన తెలుగు జాతిని మేల్కొలిపిన మహాపురుషులలో లక్ష్మణరావు ఒకరిగా ప్రసిద్ధి పొందారు. ఉన్నవ లక్ష్మీనారాయణ గారు పల్నాడు పుల్లరి సత్యాగ్రహ ఉద్యమానికి నాయకత్వం వహించారు. మాలపల్లి నవలా రచన.. దీనికే సంగవిజయం అని కూడా పేరు పెట్టారు.

పింగళి వెంకయ్య గారు భవిష్యత్తులో చైనా భారత్ పై దాడి చేస్తుందని దలైలామా వంటి శాంతికాముకులు అక్కడ ఉండలేక భారత్‌కు వస్తారని 1920 నాటికే ఊహించి తన రచనలో పేర్కొన్న క్రాంతదర్శి. ఏ నేషనల్ ఫ్లాగ్ ఫర్ ఇండియా అనే పుస్తకాన్ని రచించి అందులో 30 రకాల జండాల నమూనాలను పొందుపరిచారు.

దువ్వూరి సుబ్బమ్మ గారికి దేశభాంధవి బిరుదు ఉంది. ఖద్దరు చీరలు బరువు మోయలేకపోతున్నామని సుబ్బమ్మగారితో మొరపెట్టుకున్న వాళ్లకు గుండెత్తు బరువున్న మొగుళ్లను మోస్తున్నారు. ఉద్యమం కోసం ఈ మాత్రం కోకలు బరువయ్యాయా అంటూ తనదైన శైలిలో మందలించి వారిలో చేనేత స్ఫూర్తిని నింపారు.

కట్టమంచి రామలింగారెడ్డి గారు, బళ్ళారి రాఘవ గురించిన ఎంతో విలువైన సమాచారం ఈ తెలుగు దీపికలలో చోటు చేసుకున్నాయి.

గాడిచర్ల హరిసర్వోత్తమ రావు గారు ఆంధ్రలో మొట్టమొదటి రాజకీయ ఖైదీగా పేరుపొందారు. యంగ్ ఇండియా పత్రికలో గాంధీజీచే 'ది బ్రేవ్ హరిసర్వోత్తమరావు' అని ప్రశంసలు అందుకోవడమే కాకుండా ఆంధ్ర తిలక్ గా వీరికి పేరు ఉంది.

మాడపాటి హనుమంతరావు గారు హైదరాబాదులోని శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయం, హనుమకొండలో రాజరాజ నరేంద్ర ఆంధ్ర గ్రంథాలయం కూడా వీరు అభివృద్ధి చేసినవే. వీరు ఆంధ్ర మహాసభకు, వీరి సతీమణి ఆంధ్ర మహిళా సభకు అధ్యక్షత వహించడం ఒక అపూర్వ సంఘటన. 1955లో కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ బిరుదును పొందిన తెలుగు వారిలో వీరే ప్రథములు.

దేవరాజు వెంకటకృష్ణారావు తొలి తెలుగు డిటెక్టివ్ నవలా రచయితగా పరిగణింపబడుతున్న వారు. తాపీ ధర్మారావు తో కలిసి వేగుచుక్క గ్రంథమాలను నెలకొల్పి 1912లో దాని ద్వారా 'వాడే వీడు' తెలుగులో మొట్టమొదటి డిటెక్టివ్ నవల. కాలూరాయ్ అపరాధ పరిశోధన నవలలో నాటికి లేని, ఇంకా అప్పటికి ఉనికి లోనికి రాని హెలికాప్టర్ ని సృష్టించారు. .

బులుసు సాంబమూర్తి గారు న్యాయవాదిగా రెండు చేతులా ఆర్జిస్తూ సూటుబూటుతో మోటార్ వాహనంపై గోదావరి జిల్లాలో తిరిగిన వీరు గాంధీజీ ఇచ్చిన సహాయ నిరాకరణ పిలుపుతో ఆ దర్జాలు దర్పాలకు వీడ్కోలు పలికారు.

దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గారు 'ఆంధ్ర రత్న' బిరుదు పొందిన వారు చీరాల పేరాల వీరు పాల్గొన్న ఉద్యమ సమరం. జానపద కళారూపాల పునరుద్ధరణకు, గ్రంథాలయాల వ్యాప్తికి గోపాలకృష్ణయ్య ఇతోధికంగా కృషి చేశారు. సాధన అనే పత్రిక నడిపారు.

చిలుకూరి నారాయణరావు గారుఆంధ్ర విశ్వకళాపరిషత్తుచే కళా ప్రపూర్ణ బిరుదును కాశీ సంస్కృత విద్యాపీఠంచే 'మహోపాధ్యాయ' బిరుదును పొందారు. వీరికి ఆంధ్ర బెర్నార్డ్ షా'అనే బిరుదు ఉంది. తెలుగు సాహిత్యంలో తొలి పి.హెచ్‌డీ పరిశోధకుడు. నవ్య సాహిత్య పరిషత్తు తొలి అధ్యక్షుడు.

అయ్యంకి వెంకటరమణయ్య గారు గ్రంథాలయ ఉద్యమ పితామహుడుగా పేరు పొందారు. 1911 లో విజయవాడలో రామమోహన గ్రంథాలయ స్థాపనకు తోడ్పడ్డారు. 1914లో విజయవాడలో చిలకమర్తి లక్ష్మీనరసింహం అధ్యక్షతన ప్రథమ ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ మహాసభను జయప్రదంగా నిర్వహించారు.

మల్లంపల్లి సోమశేఖర శర్మ గారు శాసనాల శర్మగా చరిత్రలో నిలిచి పోయారు. గరిమెళ్ళ సత్యనారాయణ గారు రచయితే కాదు, గొప్ప గాయకుడు కూడా. గరిమెళ్ళ పాట విన్న బ్రిటిష్ కలెక్టరుకు తెలుగు భాష రాకపోయినప్పటికీ ఆ పాటలో ఎంతటి మహత్తర శక్తి ఉందో, సామాన్య ప్రజలను సైతం ఎలా చైతన్య పరచగలదో ఊహించి ఆ పాటను రాసినందుకు గరిమెళ్ళకు ఒక సంవత్సర కఠిన కారాగార శిక్ష విధించారు. జైలులో ఉండగా తమిళ కన్నడ భాషలు నేర్చుకున్నారు. తమిళ కన్నడ గ్రంథాలను తెలుగులోకి అనువదించారు.

తెన్నేటి విశ్వనాథం గారు- పార్టీని మార్చినప్పుడు పదవులకు రాజీనామా ఇచ్చే సత్ సంప్రదాయానికి శ్రీకారం చుట్టిన మొదటి వ్యక్తి. మన రాష్ట్రంలోనే కాక దేశంలోనే వీరు ప్రప్రథములు. కాఫీ బోర్డు ప్రెసిడెంట్‌గా ఉన్న రోజులలోనే అరకు లోయలో కాఫీ తోటలో వేయించ మొదలుపెట్టడం వీరి ప్రత్యేకత.

విశ్వనాథ సత్యనారాయణ గారు నన్నయ తిక్కన ఎర్రన్న కలగలిపిన రూపంతో పోతన లా భక్తాగ్ర గణ్యుడు. పద్యం చెప్పినా, కావ్యం రాసినా నవల రాసినా ఏ ప్రక్రియలోనైనా తన అరుదైన ప్రత్యేకతతో సాహితీ ప్రియుల హృదయాలను దోచుకున్న జ్ఞానపీఠ అవార్డు గ్రహీత.

జిడ్డు కృష్ణమూర్తి గారు 'జ్ఞాన సముపార్జనకు పరిమితం లేదు అంటూ పుస్తకాలు చదవడం పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడం, చదువు పూర్తయింది అనిపించుకోవడంతో సంపూర్ణ జ్ఞానం సంపాదించినట్టు కాదు, పుట్టిన క్షణం నుంచి శరీరాన్ని త్యజించే వరకు జీవితాంతం నిరంతరాయంగా కొనసా గాల్సిన ప్రక్రియ' అని ప్రబోధించారు.

గుర్రం జాషువా 'అస్పృశ్యలు పండించే ధాన్యం, ఆలయాలలో దేవుడి నైవేద్యంగా సమర్పిస్తున్నారు కానీ, ఆ ధాన్యం పండించే కృషికులకు ఆలయ ప్రవేశం లేదంటూ నొచ్చుకున్నారు. ధనవంతుల అపవ్యయాన్ని ఎండ గట్టారు. ఆస్థాన కవి చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రి స్వయంగా జాషువా గారికి గండపెండేరం తొడగటం ఒక అపూర్వ ఘట్టం.

డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు గారు విదేశీ వస్త్ర బహిష్కరణ ఉద్యమంలో భాగంగా ఖద్దర్‌తో నేసిన సర్జికల్ యాప్రాన్ వేసుకుని మెడికల్ కాలేజీకి హాజరయ్యేవారట. 1945లో బెంజమన్ డగ్గర్ తో కలిసి ఆయన టెట్రాసైక్లిన్ని కనిపెట్టారు. ఫైలేరియా కోసం హైట్రజెన్ ఔషధం, టి.బిని అరికట్టడానికి




ఐసోనికోటినిక్ ఆసిడ్, హైడ్రాజైడ్ కనిపెట్టారు. క్యాన్సర్ కీమోథెరపీ వాడకం గురించి తొలి డ్రగ్ మెథో ట్రేక్సేట్‌ను డెవలప్ చేసింది సుబ్బారావు గారే.

కనుపర్తి వరలక్ష్మమ్మ గారు 'నా జీవము ధర్మము, నా మతము నీతి, నా లక్ష్యము సతీ శ్రేయము. ఈ మూడింటిని సమర్థించుటకే నేను కలము పూనితిని' అని చెప్పుకున్న రచయిత్రి. బాపట్లలో 'స్త్రీ హితైషిణి మండలి'ని స్థాపించి స్త్రీల కొరకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టి సమాజ సేవ చేశారు.

సుబ్బారావు గారు 'లోకమాన్య' అనే పత్రికకు సంపాదకత్వం వహించారు. కల్లూరి సుబ్బారావు గారిని బాబు రాజేంద్రప్రసాద్ 'జైలు పట్టభద్రుడు' అని కొనియాడారు.

దామెర్ల రామారావు గారు రాజమండ్రిలో నాటక ప్రదర్శనలు ఎక్కువగా జరుగుతున్న సమయంలో నాటకాన్ని కొత్త తరహాలో ప్రదర్శించిన వారిలో ముఖ్యులు. హిందూ డ్రమెటికల్ కంపెనీ వారు ప్రతి ఒక్క నాటకాన్ని కొత్త బ్యాక్ డ్రాప్ తో సరికొత్తగా తయారుచేసి ప్రదర్శించేవారు. అజంతా ఎల్లోరాలను సందర్శించి అక్కడ గచ్చు పై చిత్రాలు, శిల్పకళ మీద స్కెచ్ లు వేయమని రాజమండ్రి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆస్వాల్ జెన్నింగ్స్ కూల్ డ్రే ప్రోత్సహించారు. ఆంధ్ర సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆర్ట్స్ పేరున 1922లోనే ఆయన రాజమండ్రిలో ఒక చిత్రకళ పాఠశాల ప్రారంభించారు. కేవలం 28 ఏళ్లకే అకాల మరణం చెంది చిత్రకళ ప్రపంచానికి ఎంతో అన్యాయం జరిగింది. ఇలా 'మన తెలుగు దీపికలు' ఎన్నెన్నో గొప్ప విషయాలను ఇప్పటి తరం వారికి తెలియనివి, మరొకసారి చదివించే రీతిలో వారి ఛాయా చిత్రాలతో ఈ పుస్తకాన్ని అందంగా సర్వాంగ సుందరంగా ఆయిల్ పేపర్ పై ముద్రించి తీర్చిదిద్దారు సంపాదకులు వివిఎస్ రాఘవాచారి గారు విభిన్న తరహాలో. వీరి సాహితీ సేవ ప్రస్తుతించ తగ్గది. తెలుగు భాషా సాహిత్య సేవ చేస్తున్న వీరు కందుకూరి పురస్కారం, కళాబంధు, గరుడ పురస్కారాలతో గతంలో సత్కరింపబడ్డారు.

కళాదీపిక సంపాదకుడు వి. ఎస్. రాఘవాచారి.. 'మన తెలుగు దీపికలు' (స్ఫూర్తి ప్రదాతలు సృజనాత్మక శిఖరాలు)అన్న శీర్షికన 'కళాదీపిక' పదవ ప్రచురణగా వెలువరించారు. (వెల రూ.150/, పేజీలు 137: మొబైల్ నం. 99088 37451)

- మల్లేశ్వర రావు ఆకుల
7981872655

# బహుభాషా కోవిదుడు 'గడియారం'



అతడు నిజంగానే అనేక యుద్ధములలో ఆరి తేరిన వృద్ధమూర్తి. జీవించింది ఎనభైఏడేళ్ళు. స్వాతంత్ర్యోద్యమం, గ్రంథాలయోద్యమం, ఆంధ్ర మహాసభలు, సంఘ సంస్కరణలు, నిజాం వ్యతిరేక పోరాటం,ఆంధ్ర సారస్వత పరిషత్తు మొదలైన ఉద్యమాల్లో పాల్గొన్న వజ్ర సంకల్ప సదృశ నాయకత్వం, కవితా రచన, పత్రికా రచన, శాసన పరిశోధన,కావ్యాలంకార నాటక వ్యాకరణాది శాస్త్ర పాండిత్యం, అనువాదం, నాటక సమాజ స్థాపన, నటన, దర్శకత్వం వంటి సాంస్కృతికాభ్యుదయ శాఖల్లో సాంద్రతరమైన కృషితో తాను సంచరించిన తెలంగాణను వెలిగించిన బహుముఖీన ప్రతిభామూర్తి, అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటిగా వెలుగొందుతున్న పరమ పావన ఆలంపుర క్షేత్ర జోగులాంబ ఆలయ సంరక్షకుడు, సాహితీ మూర్తి గడియారం రామకృష్ణశర్మ. అనంతపురం జిల్లాలో జన్మించినా చిన్నతనంలోనే తెలంగాణకు వచ్చి ఆలంపురంలో స్థిరపడి జీవిత చరమాంకం వరకు ఆలంపురంతో పాటు తెలంగాణకు తన సేవలను విస్తరింపజేసిన విశిష్ట విద్వన్మూర్తి శర్మ గారు.

రామకృష్ణ శర్మ గారు 1919 మార్చి 6న రాయలసీమలోని అనంతపురం జిల్లా కదిరి తాలూకా బాబాసాహెబ్ గ్రామంలో జన్మించారు. వారి తల్లిదండ్రులు శ్రీమతి సుబ్బమ్మ, జ్వాలాపతి శాస్త్రి గార్లు. జ్వాలాపతి శాస్త్రి సుప్రసిద్ధ జ్యోతిష్య పండితులు. శర్మ గారి విద్యాభ్యాసం ఆ ఊరిలో వీధిబడిలో ప్రారంభమై ఎలిమెంటరీ స్కూల్లో ఐదవ తరగతి వరకు కొనసాగింది. ఆ పై తరగతులకు సంబంధించి అక్కడ బడి లేకపోవడంతో ఒక సంవత్సరం పాటు పాఠశాల విద్యకు దూరమయ్యారు. ఆ సమయంలో చిన్నాన్న రామశర్మ గారి వద్ద అమరకోశము, కొన్ని వేదమంత్రాలను అభ్యసించారు. ఈలోగా శర్మగారి అక్కకు వివాహమైంది. ఆమెను ఆలంపురానికి ఇచ్చారు. బావగారి ప్రోద్బలంతో శర్మగారు అలంపురం చేరుకొని అక్కడ ఉర్దూ మీడియంలో ఆరవ తరగతిలో చేరారు. ఆనాడు నిజాం రాష్ట్రంలో తెలుగువారు ఉర్దూ మీడియంలో చేరి చదువుకోవాల్సిన పరిస్థితి ఉండేది. శర్మ గారికి అది నచ్చక ఒక సంవత్సరం చదివి బడి మానేశారు. అన్న వరస అయినా సమీప బంధువు ద్వారా తెలుగు పుస్తకాలు తెప్పించుకొని స్వయంగా అధ్యయనం చేశారు. ఆ క్రమంలోనే మహాభారతం, భాగవతం ప్రబంధాలను చదువుకున్నారు. వేలూరి శివరామశాస్త్రి గారి వద్ద శిష్యుడుగా చేరి సంస్కృతం, అలంకార వ్యాకరణ శాస్త్రాలను అభ్యసించారు.ఆరో తరగతితో తన పాఠశాల విద్యాభ్యాసం ముగిసిపోయిన స్వయం అధ్యయనంతో సంస్కృతాంధ్ర భాషల్లో పాండిత్యం సంపాదించారు.

ఒకసారి శర్మగారు అలంపురంలో అతను మిత్రులతో కలిసి హరిచంద్ర నాటకం వేస్తుండగా తప్ప తాగి వచ్చిన పోలీసు ఆమీన్ రంగస్థల నటులను దుర్భాషలాడుతూ తెలుగు పద్యాలు పాటలు వద్దని,ఉర్దూ గజల్స్ పాడమని వేదిక మీద అల్లరి చేశాడు. తెలుగు భాషకు జరిగిన అవమానాన్ని తట్టుకోలేని శర్మగారు ఆమీన్‌ను ఎదిరించారు. తర్వాత అలంపురంలో తన మిత్రులతో కలిసి ఆంధ్ర యువజన నాట్య మండలి స్థాపించి ఎన్నో నాటక ప్రదర్శనలు ఇచ్చారు. నాడు నిజాం పాలనపై ఉద్యమాన్ని నడుపుతున్న ఆంధ్ర మహాసభలో చేరి కార్యదర్శిగా పనిచేస్తూ ఉద్యమాన్ని నడిపారు. ఆ సమయంలో తెలంగాణ ప్రజలను ఉద్యమ కార్యోన్ముఖులను చేయడానికి వారిని చైతన్య పరచడానికి రహస్యంగా భాగ్యనగర్ రేడియో కేంద్రాన్ని నెలకొల్పి సందేశాలను అందించేవారు. సురవరం ప్రతాపరెడ్డి గారి ప్రోత్సాహంతో సుజాత పత్రికకు సంపాదకుడిగా ఉంటూ నిజాం మరియు బ్రిటిష్ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వ్యాసాలు రాస్తుండేవారు. సాంఘిక దురాచారాలను నిరసిస్తూ వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించడమే కాకుండా తాను స్వయంగా కమలమ్మ అనే వితంతువును వివాహమాడి ఆదర్శంగా నిలిచారు. అనాధ స్త్రీల కొరకు ప్రత్యేక విద్యాలయం స్థాపించి శిక్షణ ఇప్పించి వారికి జీవనోపాధిని కల్పించారు. ఆంధ్రోద్యమంతోపాటు గ్రంథాలయోద్యమాన్ని నడిపి వాటి స్థాపనకు అభివృద్ధికి కృషి చేశారు.

కర్నూలు జిల్లా నిడుజూరాలో పదేళ్ళ వయసు గల బాల వితంతువుకు పునర్వివాహం చేయించారు. 5-6 వితంతు పునర్వివాహాలు చేయించారు. దాంతో కులబహిష్కార దండనను ధైర్యంగా ఎదుర్కొని నిలిచారు. 1953లో ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆలంపురంలో సప్తమ మహాసభలు జరుపుకున్నది. సభల్లో 30వేల మంది పాల్గొనడం ఒక రికార్డు. నిజాం రాష్ట్ర ఆంధ్ర సరస్వత పరిషత్తు స్థాపకులలో ఒకడిగా, కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడిగా వివిధ హోదాల్లో తెలుగు భాషా సాహిత్యాలకు ఎనలేని సేవ చేశారు.

ఆలంపురం ఆలయాలతో శర్మ గారి జీవితం పెనవేసుకు పోయింది ఆలంపురంలో ఎన్నో తామ్ర శాసనాలు ఉన్నాయి. వాటి గురించి తెలుసు కోవాలని శర్మ గారికి ఆసక్తి కలిగింది.అదే ఆయనను పరిశోధన రంగం వైపు మళ్ళించింది. దేవాలయాల వాస్తు నిర్మాణంపై ఆసక్తితో వాస్తు శాస్త్రాన్ని అధ్యయనం చేసి ఆలయాల వాస్తు నిర్మాణ వైశిష్ట్యాన్ని అందరికీ తెలియజేశారు. ఆలంపుర ఆలయాల అభివృద్ధి కొరకు ఏర్పాటు చేయబడిన



జోగులాంబ బాల బ్రహ్మేశ్వర దేవస్థాన కమిటీ అధ్యక్షుడిగా దశాబ్దాల పాటు పనిచేసే ఆలయాల అభివృద్ధికి కృషి చేశారు. ఒక విధంగా శర్మగారు ఆలంపురం క్షేత్ర పరిరక్షకుడిగా పనిచేశారనడంలో అతిశయోక్తి లేదు.

శర్మగారు అలంపురం చరిత్ర - మహత్యం, దక్షిణ వారణాసి, బీచుపల్లి క్షేత్రచరిత్ర, ఉమా మహేశ్వర క్షేత్ర చరిత్ర మొదలైన క్షేత్ర చరిత్రలు, పాంచజన్యం, చంద్రహాసోపాఖ్యానం వంటి పద్య కావ్యాలు, కన్నడ సాహిత్య చరిత్ర,పంజాబ్ సాహిత్య చరిత్ర, మన వాస్తు సంపద, భారతీయ వాస్తు విజ్ఞానం, వీర గాథలు అనే కథా సంపుటి మొదలైనవెన్నో రాశారు. శతపత్రం పేరుతో ఆత్మ కథ రాసుకున్నారు. ఆ గ్రంథానికి శర్మ గారి మరణాంతరం 2007లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది.

ఇవేగాక శర్మగారు ఆలంపురంలోని రైతుల అభ్యున్నతికై రైతులందరినీ సంఘటిత పరిచి ఆలంపురం వ్యవసాయ సంఘాన్ని స్థాపించారు.ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సభ్యుడిగా, కేంద్ర సాహిత్య అకాడమీ సలహా మండలి సభ్యుడిగా,గ్రంథాలయ సంస్థ సభ్యుడిగా, ఉస్మానియా విశ్వవిద్యాలయం అకాడమిక్ కౌన్సిల్ సభ్యుడిగా అనేక విధాలుగా తన సేవలు అందించారు గడియారం లాగ నిరంతరం ఆలంపుర అభివృద్ధికి పాటుపడిన మహామనిషి 2006 జూలై 25న పరమపదించారు. శర్మ గారి జీవిత అనుభవాలు విద్యార్థులకు పాఠ్యాంశంగా చేర్చడం ద్వారా మనం ఆయనను గౌరవించిన వారమవుతాం.

- సుధాకర్. ఏ.వి
9000674747

# జ్ఞానపీఠ సాహితీ సుమాలు



కేదార్‌నాథ్ సింగ్ భారతదేశానికి చెందిన సుప్రసిద్ధ ఆధునిక హిందీ కవి, విమర్శకుడు, వ్యాసకర్త. జూలై 7,1934న ఉత్తరప్రదేశ్ లోని బలియా జిల్లా, చకియా గ్రామంలో జన్మించిన ఆయన హిందీ సాహిత్యానికి చేసిన విశేష కృషికి గాను 2013 సంవత్సరంలో అత్యున్నత సాహిత్య పురస్కారమైన జ్ఞానపీఠ అవార్డును అందుకున్నారు. ఆయన రచనలో ఒక ఆత్మీయ ఆర్ద్రత కనబడుతుంది. కేదార్‌నాథ్ సింగ్ చుట్టూ ఉన్న ప్రపంచాన్నే తన కవిత్వానికి వస్తువుగా మలచుకుని అనేక కావ్యఖండాలను చెక్కారు. ఆయన కవితాయాత్ర 1950 నుంచే మొదలవుతుంది. సమకాలీన హిందీ కవిత చరిత్ర రచనా రీతుల మీద చర్చకు తెరలేపిన కవి ఆజ్ఞేయ్ సంపాదకత్వంలో 1950లో వెలువడిన 'తార్ సప్తక్'లో స్థానం పొంది అప్పట్లోనే శక్తివంతమైన యువకవిగా పేరొందారు. ఆయన కలం నుంచి వెలువడిన కవితా సంకలనాల శీర్షికలను చూడగానే కవి తృష్ణ అవగతమవుతుంది. 'అభిబిల్కులే అభి', 'జమీన్ పక్ రహీ హా', 'అకల్ మే సారస్' (కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన రచన) టాఘ్ (పులి) ల్లాంటి అత్యంత శక్తివంతమైన రచనలు ఆయన సృజనలు. హిందీలోని 'నవ్య కవిత్వం' (నయీ కవిత) ఉద్యమంతో ఆయనకు బలమైన అనుబంధం ఉంది. ఆయన రచనలలో 'పులి' కవితా సంకలనం ప్రసిద్ధమైనది. మానవ







జీవితంలోని వికృతాన్ని, విపరీత పోకడలను తిరస్కరించడమంటే మనిషిలోని ప్రేమను బ్రతికించడమే. కేదార్‌నాథ్ సింగ్ హిందీలోని 'నవ్య కవిత్వం' (నయీ కవిత) ఉద్యమంతో బలమైన అనుబంధం పెంచుకున్నారు. ఆయన ప్రముఖ రచనలలో అకాల్ మే సరస్ (కరువులో కొంగలు) ప్రసిద్ధ కవితా సంకలనానికి గాను ఆయనకు 1989లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. పురస్కారాలు,గౌరవాలు ఆయన పొందిన వాటిలో జ్ఞానపీఠ పురస్కారం (2013)సాహిత్య అకాడమీ అవార్డు (1989)వ్యాస సమ్మాన్, కుమారన్ ఆశాన్ అవార్డు మరియు దినకర్ పురస్కారం వంటి మరెన్నో ప్రతిష్టాత్మకమైనవి కలవు. కేదార్ నాథ్ సింగ్ మార్చి19, 2018న న్యూఢిల్లీలో కన్నుమూశారు.

భారతదేశానికి చెందిన ప్రముఖ గుజరాతీ భాషా కవి, సాహిత్యకారుడు. గుజరాతీ సాహిత్యంలో గాంధీ యుగం తర్వాతి కాలంలో (అను-గాంధీ యుగం) అత్యంత ప్రతిభాశాలిగా ఆయన గుర్తింపు పొందిన రాజేంద్ర కేశవలాల్ షా జనవరి 28,1913 కాపడ్వాని, బొంబాయి ప్రెసిడెన్సీలో జన్మించారు. ఎం.ఎస్.యు బరోడా పూర్వ విద్యార్థి రాజేంద్ర షా రాసిన ప్రసిద్ధ రచనలలో ధ్వని ,శాంత్ కోలాహల్ కలవు.

షా కవిత్వం రాయడమే కాకుండా, ఠాగూర్ కవితా సంకలనం బాలాకాను కూడా అనువదించాడు. ఆయన జయదేవుని గీత గోవింద , కోల్రిడ్జ్ రాసిన ది రిమ్ ఆఫ్ ది ఏన్షియంట్ మెరైనర్ ,డాంటే రాసిన ది డివైన్ కామెడీ లను కూడా అనువదించాడు. ఆయన వివిధ వృత్తులతో పాటు బొంబాయిలో ఒక ప్రచురణకర్తగా ఆయన1957 లో కవిలోక్ అనే కవితా పత్రికను ప్రారంభించాడు. షా బహుగ్రంథ కర్త. ఆయన కవితా సంకలనాలు ధ్వని, అందోలన్, శ్రుతి,మోర్పిన్చ్,శాంత్ కోలహాల్, చిత్రానా పత్రాలేఖా,ప్రసాంగ్ సప్తక్ , స్మృతిసంవేదన, విరాహ్మాధురి, వ్రజ్వైకుంతే,హా... హు సాక్షి చు,ప్రేమ్నో పరియే ఇంకా ఆ గగన్ కలవు. రాజేంద్ షా అందుకున్న ప్రసిద్ధ పురస్కారాలెన్నో కలవు. వాటిలో 1947లో కుమార్ చంద్రక్ అవార్డ్, 1956లో రంజిత్రం సువర్ణ చంద్రక్ పురస్కారం, 1963లో సాహిత్య అకాడమీ పురస్కారం, 1992లో సాహిత్య గౌరవ్ పురస్కారం,1999లో నరసింగ్ మెహతా పురస్కారం, 2001లోప్రతిష్టాత్మకమై జ్ఞానపీఠ పురస్కారాన్ని పొందారు.'అతని భావోద్వేగం, ఆవిష్కరణల తీవ్రత, వ్యక్తీకరణ అతనిని గొప్ప ప్రాముఖ్యత కలిగిన కవిగా వేరు చేసింది. ఇక ఆయన కవిత్వం యొక్క ఆధ్యాత్మిక స్వరం నర్సింగ్ మెహతా, కబీర్, అఖో వంటి గొప్ప మధ్యయుగ కవుల సంప్రదాయం నుండి వచ్చింది' అని పురస్కారానికి ఎంపికచేసే న్యాయమూర్తులు గుర్తించడం రాజేంద్ర షాతో పాటు గుజరాతీ సాహిత్యానికి వన్నె తెచ్చింది. గుజరాతీ సాహిత్య సీమలో ప్రసిద్ధ అభ్యుదయ కవిగా వెలిగిన రాజేంద్ర కేశవ్ లాల్ షా జనవరి 2,2010న తన 96 యేండ్ల వయసులో ముంబాయిలో కన్నుమూశారు.

సీతాకాంత్ మహాపాత్ర ఒడియా మరియు ఆంగ్ల భాషలలో విశిష్టమైన భారతీయ కవి మరియు సాహిత్య విమర్శకుడుగా పేరున్న సీతాకాంత్ మహాపాత్ర సెప్టెంబర్ 17,1937న ఒడిషాలోని మహానది యొక్క ఉపనది 'చిత్రోత్పల' యొక్క ఒడ్డున గల మహంగ గ్రామంలో జన్మించారు. సీతాకాంత్ మహాపాత్ర సాంప్రదాయ కుటుంబంలోని ఒరియా భాషలో భగవద్గీతలోని అధ్యాయాల్ని వల్లె వేస్తూ పెరిగాడు. 1959లో అలహాబాద్ యూనివర్సిటీ నుండి రాజనీతి శాస్త్రంలో ఎం.ఎ డిగ్రీని పూర్తి చేసారు. ముందు ఆయన ఆంగ్లము, ఒరియా భాషలలో రచనలను చేశారు. కానీ తరువాత ఆయన తన స్థానిక భాషలోనే కవిత్వం రాయాలని నిర్ణయించుకున్నాడు. ఎందుకంటే 'ఒక కవి తను కలలు కన్న భావాలను వ్యక్తీకరించడానికి స్వంత భాష అవసరం' అనేది ఆయన అభిప్రాయం. భారతీయ సాహిత్యానికి ఆయన చేసిన విశేష కృషికి గుర్తింపుగా 1993లో భారతదేశపు అత్యున్నత సాహిత్య పురస్కారమైన 'జ్ఞానపీఠ్ అవార్డు'తో సీతాకాంత్ మహాపాత్రను సత్కరించారు. 1974లో 'శబ్దర్ ఆకాశ్' కవితా సంపుటికి గాను ఒడియా భాషలో సాహిత్య అకాడమీ అవార్డు లభించిన సీతాకాంత్ మహాపాత్ర 2002లో భారత రాష్ట్రపతి ఆయనకు దేశపు పౌర పురస్కారమైన 'పద్మ భూషణ్' 2010లో పద్మవిభూషణ్‌ను అందు కున్నారు. ఠాగూర్ శాంతి అవార్డు 2017లో అందుకున్నారు. ఆయన రచనల లో అష్టపది , శబ్దర ఆకాశ, అరదృశ్య, శ్రేష్ఠ కవిత కవితా సంపుటాలు ముఖ్యమైనవి. సీతాకాంత్ సృజన విశాలం బహుళం. ఒడియా భాషలో ఆయన రాసిన మొదటి కవితా సంపుటి 'దీప్తి ఓ ద్యుతి' 1963లో ప్రచురితమవగా ఆయన రెండవ సంపుటి 'అష్టపది'. ఆయన ఒడియాలో 350కి పైగా కవితలను, అలాగే ఆంగ్లంలో సాహిత్య విమర్శ మరియు సంస్కృతికి సంబంధించిన సుమారు 30 ప్రచురణలను వెలువరించారు. సంతాల్ గిరిజన సంస్కృతి మరియు సంతాలీ భాషపై ఆయనకున్న పట్టుతో గిరిజనుల మౌఖిక కవిత్వానికి సంబంధించిన తొమ్మిది సంపుటాలు వెలువరించారు. వీటిలోని కవిత్వాన్ని ఆయన స్వయంగా సేకరించారు.

- డా.టి.రాధాకృష్ణమాచార్యులు
9849305871

# ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు



**అల్లూరి జిల్లా , ఆగష్టు 9(మనం న్యూస్):** అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరులోని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐ.టి.డి.ఎ.) సమావేశ మందిరంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమాం ఐ.టి.డి.ఎ. సమావేశ మందిరం, పాడేరులో ఆదివాసీల హక్కులు, సంస్కృతి, సాంప్రదాయాలు మరియు వారి సంక్షేమాన్ని స్మరించుకుంటూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పిబికె పరిమళ పేర్కొన్నారు.ఈ సమావేశం ప్రారంబానికి ముందుగా గిరిజన విప్లవ వీరులు, అమరవీరులైన స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సీతారామరాజు, కీ. శే. గాం. మల్లుదొర, మాజీ ఎం .పి వారి విగ్రహాలకు పూల మాల వేసి నివాళులర్పించి అనంతరం ఐటిడిఏ సమావేశం మందిరంలో ఏర్పాటుచేసిన కొమరం భీమ్, అల్లూరి సీతారామరాజు, గాం గంటందొర చిత్రపటాలకు పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన గావించి ఘనంగా నివాళులర్పించిన గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పి బి కె పరిమిళ, ఐటీడీఏ పరిపాలన అధికారి హేమలత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎం సి డి అధికారి డాక్టర్ ప్రతాప్, సమాచార శాఖ సహాయ ప్రాజెక్టు అధికారి, ప్రత్యేక ప్రచార విభాగం,పాడేరు వారు కె వెంకటరావు.ఈ కార్యక్రమంలో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి, వారి హక్కుల పోరాటానికి ఈ అమర వీరులు చేసిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.ఈ వేడుకల్లో డిప్యూటీ తహాశీల్దార్ (ఆర్ ఓ ఎఫ్ ఆర్) ఈశ్వరరావు, సుబ్రహ్మణ్యం, ఐ.టి.డి.ఎ. అధికారులు, స్థానిక గిరిజన నాయకులు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఆదివాసీ హక్కులే అభివృద్ధికి పునాది..!

- చింతూరులో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు
- అన్నీ తానై నడిపించిన ఐటీడీఏ పీవో శుభం నక్వాల్
- హక్కుల పరిరక్షణకు ఐక్యంగా గళం వినిపించిన ఆదివాసీలు
- విద్యతోనే యువతకు ఉజ్వల భవిష్యత్: ఏఎస్పీ
- వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఘన సన్మానం
- 3,600 మందితో ఆదివాసీ సంబరాలకు వేదికైన ఏపీఆర్ గ్రౌండ్



**పోలవరం జిల్లా, ఆగస్టు 9(చింతూరు మనం న్యూస్):** అడవినే అమ్మగా.. కొండలను కొలువుగా.. ప్రకృతినే జీవనాధారంగా చేసుకుని తరతరాలుగా జీవిస్తున్న ఆదివాసీల హక్కులు, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆదివాసీ నాయకులు పిలుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా చింతూరులో ఆదివాసీ సంస్కృతి, హక్కులు, అభివృద్ధి అంశాలు ప్రధానంగా వినిపించాయి. ఐటీడీఏ ఆధ్వర్యంలో చింతూరు ఏపీఆర్ గ్రౌండ్లో ఆదివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చింతూరు డివిజన్లోని చింతూరు, వీఆర్పురం, కూనవరం, ఎటపాక మండలాల నుంచి సుమారు 3,600 మంది ఆదివాసీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు తరలివచ్చారు. దీంతో ఏపీఆర్ గ్రౌండ్ ఆదివాసీ జనం సందడితో కళకళలాడింది.

### బిర్సా ముండా చిత్రపటానికి నివాళులు

ఉదయం ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో ఏపీఓ సీహెచ్ రామతులసి, ఆదివాసీ నాయకులతో కలిసి ఆదివాసీ వీరుడు బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండా, ఆదివాసీ జెండాలను ఎగురవేశారు. అక్కడి నుంచి బైక్ ర్యాలీగా చింతూరు సెంటర్కు చేరుకుని అక్కడి గిరిజన నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీ నాయకుల చేతుల మీదుగా ఆదివాసీ జెండాను ఎగురవేసిన అనంతరం ఏపీఆర్ గ్రౌండ్లో ఏర్పాటు చేసిన ప్రధాన వేదిక వద్దకు చేరుకున్నారు.

### ఆదివాసీ సంస్కృతికి అద్దం పట్టిన ప్రదర్శనలు

ఏపీఆర్ గ్రౌండ్లో వెలుగు, విద్య, వైద్యం, జీసీసీ, ఐసీడీఎస్ తదితర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఏపీఓ రామతులసి, ఆదివాసీ నాయకులు సందర్శించారు. అనంతరం ప్రధాన వేదిక వద్ద ఆదివాసీ జెండాను ఎగురవేశారు. బిర్సా ముండా, కొమరం భీమ్, గంటం దొర, మల్లుదొర, కోపర్ లింగో తదితర ఆదివాసీ నాయకుల చిత్రపటాలకు ఏపీఓ రామతులసి, ఏఎస్పీ బి.హేమంత్ కుమార్, ఆదివాసీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం వందేమాతరం, ఆదివాసీ గీతాన్ని ఆలపించారు.

# వైజాగ్‌లో అల్లు అర్జున్ కొత్త మల్టీ ప్లెక్స్

## బన్నీ చేతుల మీదుగా గ్రాండ్‌గా ప్రారంభం

**విశాఖపట్నం, ఆగస్టు 9(చింతూరు మనం న్యూస్):** ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా విశాఖపట్నంలో నూతన అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం కావడం సంతోషకరమని ప్రముఖ నటుడు అల్లు అర్జున్ అన్నారు ఎ ఎ సినిమాస్ విశాఖలో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ మేరకు విశాఖపట్నంలోని కైలాసపురం, పరిది సాలిగ్రామపురం లో ఇనార్బిట్ మాల్ లో ఆదివారం నాడు ఏఏఏ మల్టీప్లెక్స్ థియేటర్, మొత్తం 8 స్క్రీన్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విశాఖపట్నంతో నాకు ఎన్నో ఏళ్లుగా అనుబంధం ఉంది. గంగోత్రి షూటింగ్ టైంలో ఇక్కడి రోడ్లపై తిరిగేవాణ్ని. అప్పుడు ఎవ్వరూ గుర్తుపట్టేవారు కాదు. కానీ ఇప్పుడు అలా స్వేచ్ఛగా తిరగలేకపోతున్నా. ఈ నగరంలో ఏఏఏ థియేటర్‌ను ప్రారంభిస్తున్నందుకు నాకు ఆనందంగా ఉందన్నారు . ఈ జర్నీలో నా భార్య స్నేహ సహకారం మరువలేనిదని,ప్రస్తుతం 'రాకా' షూటింగ్ ముంబయిలో జరుగుతోందన్నారు. ఈ ఈవెంట్ కోసం సెలవు తీసుకొని వచ్చాను అని




అల్లు అర్జున్ పేర్కొన్నారు. అభిమానుల అభ్యర్థన మేరకు వారిని వేదికపైకి పిలిచి ఫొటోలు దిగారు. అల్లు అర్జున్ రాక విషయాన్ని తెలుసుకుని పెద్ద ఎత్తునా అభిమానులు ఇనార్బిట్ మాల్ వద్దకు తరలివచ్చారు. ఫ్యాన్స్ బైక్ ల పై భారీగా తరలిరావడంతో పలుచోట్ల ట్రాఫిక్ కు అంతరాయం కలిగింది. ప్రారంభోత్సవం అనంతరం అక్కడినుండి తిరిగివెళ్లిపోయారు. మార్గ మధ్యలో అభిమానులకు అభివాదాం చేశారు.

# ఆదివాసి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది

## ఆధునిక సాంకేతికను వినియోగించుకుని అభివృద్ధి చెందాలి: జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్

**కర్నూలు, ఆగస్టు 9(మనం న్యూస్):** ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ఆదివాసీలు అభివృద్ధిలోకి రావాలని ప్రపంచ ఆదివాస దినోత్సవం కార్యక్రమం లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం సునయన ఆడిటోరియంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ , పాణ్యం శాసనసభ్యులు గౌరు చరిత మరియు ఆదివాసీ నాయకులు జ్యోతి ప్రజ్వలన గావించి ఆదివాసి స్వాతంత్ర ఉద్యమ కారులకు , ఆదివాసి నేతలకు పుష్పాలు సమర్పించి నివాళులర్పించారు.

ప్రతి సంవత్సరం ఆగస్టు 09 న ప్రపంచ ఆదివాసి దినం జరుపుకోవాలని ఐక్యరాజ్య సమితి నిర్ణయం చేసినది అని ఆ మేరకు ప్రపంచంలో 93 దేశాలు ప్రపంచ ఆదివాసి దినోత్సవం జరుపుకుంటూ ఉన్నాయని , ఈ రోజు ఉత్సవం మనం ఇక్కడ సునయన ఆడిటోరియం లో జరుపుకుంటున్నామని జాయింట్ కలెక్టర్ ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సభికులను ఉద్దేశించి మాట్లాడుతూ... స్వాతంత్రం రాకముందు ఆదివాసీలకు ఓటు హక్కు లేదని , స్వాతంత్రం వచ్చిన తర్వాత ఆదివాసులకు సమాన హక్కులు కల్పించబడ్డాయని , అస్పృశ్యత నివారణ చట్టం తీసుకుని వచ్చి హక్కులు కల్పించబడ్డాయని , ఓటు హక్కు కల్పించి వారికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి వారి అభివృద్ధికి కృషి జరిగిందని తెలిపారు. కొన్ని సంవత్సరాల క్రిందట సమాజంలో



ఆదివాసీలు చదువులో వెనుకబడి 60 శాతం గా ఉండేవారని ఇప్పుడు దాదాపు 95 శాతానికి చేరుకున్నారని తెలిపారు. అటవీ హక్కు చట్టం కల్పించి అక్కడ వారికి సౌకర్యాలు కల్పించడం జరిగిందని తెలిపారు. గత 50 సంవత్సరాలు నుండి ఆదివాసీల అభివృద్ధి జరుగుతూ ఉన్నదని తెలిపారు.

ప్రస్తుతం ఒక విద్యార్థిపై నెలకు పదివేల రూపాయలు ఖర్చు చేస్తూ ప్రభుత్వం వారిని చదివిస్తూ ఉందని తెలియజేశారు.ఆదివాసి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది అని తెలిపారు.జిల్లాలోని గిరిజన పాఠశాలలలో ఈ సంవత్సరం పదవ తరగతి పరీక్షలలో 80 మంది బాలికలకు గాను 80 మంది ఉత్తీర్ణత సాధించారని , 52 మంది బాలురులలో 51 మంది ఉత్తీర్ణత సాధించారని , మొత్తం 99.24 శాతం గా ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.గత 20 సంవత్సరాల నుండి ఆదివాసీల చదువు విషయంలో గననీయమైన అభివృద్ధి జరిగిందని తెలిపారు. ప్రస్తుతం విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తీర్ణులు కావాలని , ఉద్యోగాలు సంపాదించడానికి , వ్యాపార అభివృద్ధికి ఇంటర్నెట్ ద్వారా చాట్ జిపిటి ,మెటా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మొదలగు వాటి సహాయంతో పోటీ పరీక్షలను , వ్యాపార అభివృద్ధి కి కావలసిన సమాచారాన్ని సేకరించుకొని అభివృద్ధి చెందాలని విద్యార్థులను కోరారు. గతంలో ఆదివాసీ మహిళలు చదువుకునే వారు కాదని ఇప్పుడు అందరూ చదువుకుంటున్నారని తెలిపారు. కావున ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని అన్ని విధాల అభివృద్ధిలోకి వచ్చి మీ కుటుంబాలను అభివృద్ధి చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ సూచించారు.

# ముదునూరికి ఘన సన్మానం

- వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ముదునూరి




**శంఖవరం, ఆగష్టు 9(మనం ప్రతినిధి)** తకాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజును వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన సందర్భంగా ప్రత్తిపాడు ఎంపిపి గోళ్ళ క్రాంతి సుధాకర్ మర్యాదపూర్వకంగా కలిసి సాలువలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసారు. వారితోపాటు అన్నవరం ఎంపీటీసీ దడాల సతీష్,ప్రత్తిపాడు ఎంపీటీసీ సౌద్రపు భాస్కరరావు , ముఖ్య నాయకులు బవురువాక మాజీ సర్పంచ్ దొడ్డి సత్యనారాయణ, మాజీ ఉపసర్పంచ్, వెంకటరమణ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు లక్ష్మీ, సతీష్ రాజు, చిట్టిబాబు, కృష్ణ, కిషోర్ పలువురు ముఖ్య నాయకులు పాల్గొని మురళీ కృష్ణంరాజును ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు.

# న్యాయవాదం కష్టపడితేనే గుర్తింపు..

## సీనియర్ అడ్వకేట్ బ్రిజేస్ బన్సల్




**విశాఖపట్నం, ఆగస్టు 9(మనం న్యూస్):** దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో ఆదివారం భారత అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా, సీనియర్ అడ్వకేట్ బ్రిజేష్ బన్సల్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో రాణించాలంటే దగ్గర దారి ఏది లేదని ఎంత కష్టపడితే అంత వృద్ధి లో కి చేరుకుంటామని తెలుపుతూ న్యాయవాద వృత్తిలో ప్రవేశించిన తర్వాత మొదటి ఐదు సంవత్సరాలు కష్టం పడి పని చేయవలసిన అవసరం ఉంటుందని, ఒకసారి మనల్ని మనం నిరూపించుకున్న తర్వాత అంచలంచలుగా ఎదుగుతామని అదే సమయంలో న్యాయ మూర్తులుగా ఎదగి ఉన్నత స్థానాలను కూడా అధిరోహిస్తామని అంటూ అనేక మంది సీనియర్ న్యాయవాదులను, న్యాయమూర్తులు నియామకం పొందారని అందుకు నేనువ్వు కూడా ఒక ఉదాహరణ అంటూ ఆయన తెలియజేశారు. న్యాయవాది మొదటి రెండు సంవత్సరాలు ట్రయిల్ కోర్టులో పని చేసినట్లయితే కావలసినంత అనుభవం వస్తుందని తరువాత హైకోర్టులకు సుప్రీంకోర్టులలో రిజిస్టర్ చేసుకోవచ్చని అన్నారు. నేటి పరిస్థితుల్లో మధ్యవర్తిత్వం ఎంతగానో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని విద్యార్థులు మధ్య వర్తిత్వంలో కూడా నిపుణత సాధించాలని తెలియజేసారు.

సీనియర్ న్యాయవాదులు కేసులు వాదించే విధానాన్ని నిశితం గా గమనించి వారి నుంచి ఎంతో నేర్చుకోవచ్చని అన్నారు. ప్రసంగం అనంతరం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు లేవనెత్తిన అనేక ప్రశ్నలకు ఆయన ఎంతో ఉత్సాహంగా సమాధానం ఇచ్చారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ విద్యార్థులు చదువుకున్న విశ్వవిద్యాలయాన్ని గురువులను గౌరవించే ముందుకు కొనసాగుతూ ఉండాలని తెలియజేస్తూ విద్యార్థులతో ఇలా రెండు మూడు గంటలు గడపడం ఎంతో ఆనందంగా ఉందని తనకున్న అనుభవాన్ని న్యాయవాద వృత్తి లోకి భవిష్యత్తులో రాబోయే నేటితరంతో పంచుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలియజేస్తూ విశాఖపట్నం ఎంతో అందమైన పట్టణమని అలాగే దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం కూడా ఎంతో పచ్చదనంతో ఎంతో ఆనందకరంగా ఉందని తరచుగా ఇక్కడికి వచ్చి విద్యార్థులతో సంభాషించేందుకు నేను సిద్ధంగా ఉన్నాను తెలియచేస్తూ విశ్వవిద్యాలయమును ఉన్నత స్థానంలో నిలుపుతున్న విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ డాక్టర్ సూర్యప్రకాశరావు ని అభినందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో విశ్వవి ద్యాలయ రిజిస్ట్రార్ ఇంచార్జ్ విశ్వచంద్రనాద్ మాదాసు ఎక్కడ మిక్కి డైరెక్టర్ సోమభట్ల ఆచార్య ఇతర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా సీఎం సహాయనిధి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**కోటబొమ్మాళి, ఆగస్టు 9 మనం న్యూస్:** ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) భరోసాగా నిలుస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. అనారోగ్యంతో సొంత ఖర్చులతో వైద్యం చేయించుకున్న అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.కోటబొమ్మాళి మండలం ఎన్టీఆర్ భవన్లో ఆదివారం నాలుగు మండలాల పరిధిలోని సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు మంత్రి అచ్చెన్నాయుడు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 44 మంది లబ్ధిదారులకు రూ.22,83,053 విలువైన ఆర్థిక సహాయాన్ని అందజేశారు. తమ కార్యాలయానికి కార్యాలయానికి ఇప్పటివరకు 557 సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులు అందగా, వాటిలో 441 మంది లబ్ధిదారులకురూ.4,83,30,503 మేర ఆర్థిక సహాయం మంజూరైనట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుతం పరిశీలనలో ఉన్న మిగిలిన దరఖాస్తులను కూడా త్వరితగతిన పరిష్కరించి అర్హులైన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

### అర్హులైన వారికి సీఎంఆర్ఎఫ్ అందేలా కార్యకర్తలు చొరవ చూపాలి

గ్రామాల్లో ఎన్టీఆర్ వైద్య సేవలు అందుబాటులో లేక సొంత ఖర్చులతో వైద్యం చేయించుకున్న అర్హులైన వారి వివరాలను గుర్తించి, అవసరమైన దరఖాస్తులు, సంబంధిత వైద్య పత్రాలను సేకరించి సమర్పించాలని మంత్రి పార్టీ కార్యకర్తలకు సూచించారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అండగా నిలవడం ప్రతి కార్యకర్త బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.



### ప్రతి ఎకరాకు సాగునీరు.. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు

టెక్కలి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రతి ఎకరాకు సాగునీరు, ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు.తాగునీటి ప్రాజెక్టుల కోసం సుమారు రూ.640 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఈ నెల 18న టెండర్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే పెద్దఎత్తున పనులకు శంకుస్థాపనలు చేపడతామని తెలిపారు. ఏడాదిన్నర వ్యవధిలో హిరమండలం రిజర్వాయర్ నుంచి ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి కొలాయిల ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.

### నేరడి బ్యారేజీతో వంశధార జలాలకు కొత్త భరోసా

దశాబ్దాలుగా పెండింగ్లో ఉన్న వంశధార-నేరడి బ్యారేజీ సమస్యకు పరిష్కారం లభించిందని మంత్రి తెలిపారు. 19 టీఎంసీల నీటిని నిల్వ చేసే వంశధార రిజర్వాయర్కు నేరడి బ్యారేజీ అత్యంత కీలకమని పేర్కొన్నారు.

ఒడిశాతో సుమారు ఆరు దశాబ్దాలుగా కొనసాగుతున్న సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రత్యేక చొరవతో పరిష్కరించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయించడంతో మార్గం సుగమమైందన్నారు. నేరడి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి అంచనాల రూపకల్పన పనులను అధికారులు వేగవంతం చేశారని చెప్పారు.

### గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత

నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో మట్టి రోడ్లకు స్వస్తి పలికి సిమెంట్, తారు రోడ్ల నిర్మాణాన్ని పెద్దఎత్తున చేపట్టామని మంత్రి తెలిపారు. ఇప్పటికే సుమారు 80 శాతం రహదారి పనులు పూర్తయ్యాయని, మిగిలిన 20 శాతం పనులను పూర్తి చేసేందుకు మరో రూ.350 కోట్ల నిధులు మంజూరు చేశామని వెల్లడించారు.

# అప్పన్న కొండపై భక్తజన సందోహం

- వేలాది మంది భక్తులకు సాఫీగా స్వామివారి దర్శనం

**సింహాచలం, ఆగస్టు 9(మనం న్యూస్):** దక్షిణ భారతదేశంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీశ్రీశ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి దేవస్థానం, సింహాచలం ఆదివారం భక్తజన సంద్రంగా మారింది. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు సింహగిరికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సుమారు 50 వేల మందికి పైగా భక్తులు స్వామివారి దివ్య దర్శనం చేసుకున్నట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి.' సింహగిరిపై భక్తుల రద్దీతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. భక్తులు 'జై వరాహ నృసింహ.. జై సింహాద్రి అప్పన్నా..' అంటూ స్వామివారి నామస్మరణతో సింహాచల కొండను మారుమోగించారు.భక్తుల భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానంకార్య నిర్వహణాధికారి జల్లేపల్లి వెంకటరావు ఆదేశాల మేరకు, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె. తిరుమలేశ్వరరావు పర్యవేక్షణలో ఆలయ అధికారులు, సిబ్బంది సమన్వయంతో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. క్యూలైన్లలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్ షెల్టర్లు, తాగునీరు, వైద్య సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, అనౌన్స్‌మెంట్ వ్యవస్థ తదితర సౌకర్యాలను అందుబాటులో ఉంచారు.

### భక్తుల సౌకర్యాలపై ఈఓ ఆరా

భక్తులకు అందుతున్న సౌకర్యాలను ఎప్పటికప్పుడు పరిశీలించిన ఈఓ శ్రీ జల్లేపల్లి





వెంకటరావు, ఉచిత ప్రసాదాల పంపిణీ కేంద్రాన్ని సందర్శించి భక్తులతో స్వయంగా మాట్లాడారు. దర్శనం సౌకర్యవంతంగా జరిగిందా? ఉచిత ప్రసాదాలు ఎలా ఉన్నాయి? ఆలయంలో అందుతున్న సౌకర్యాలపై ఏమైనా ఇబ్బందులు ఎదురయ్యాయా? అని భక్తులను అడిగి తెలుసుకున్నారు.దీనికి భక్తులు స్పందిస్తూ దర్శనం సంతృప్తికరంగా జరిగిందని, ఉచిత ప్రసాదాలు కూడా ఎంతో బాగున్నాయని, దేవస్థానం అధికారులు భక్తుల కోసం చక్కటి ఏర్పాట్లు చేశారని తెలిపారు. భక్తుల నుంచి సానుకూల స్పందన రావడంతో ఈఓ జల్లేపల్లి వెంకటరావు ఆనందం వ్యక్తం చేశారు. భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించడమే దేవస్థానం లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

### ప్రసాదాల విక్రయాలు, పంపిణీ విజయవంతం

భారీగా తరలివచ్చిన భక్తులకు అవసరమైన ప్రసాదాలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుతూ ప్రసాదాల విక్రయాలను విజయవంతంగా నిర్వహించారు. సహాయ కార్యనిర్వహణాధికారి శ్రీ వాడ్రేవు రమణమూర్తి ఆధ్వర్యంలో ప్రసాదాల విక్రయాలు, ఉచిత ప్రసాదాల పంపిణీ ప్రక్రియను సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించా -. భక్తుల రద్దీకి అనుగుణంగా అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయడంతో భక్తులు అన్ని సౌకర్యాలు సమకూర్చగలిగామని ఆలయ కార్య నిర్వహణాధికారి తెలిపారు.భక్తుల సంతృప్తే దేవస్థానం సిబ్బంది సమిష్టి కృషికి కొలమానమని, సింహాద్రి అప్పన్న దర్శనానికి వచ్చే ప్రతి భక్తుడికి ఆధ్యాత్మిక అనుభూతితో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు దేవస్థానం నిరంతరం కృషి చేస్తుందని కార్య నిర్వహణ అధికారి తెలిపారు.

## కనక దుర్గమ్మకు ఆషాఢ సారే సమర్పణ



కాట్రేనికోన ఆగష్టు 9 మనం ప్రతినిధి : కాట్రేనికోన మండల పరిధిలో చెయ్యేరు గ్రామ పంచాయతీ శివారు చెయ్యేరు అగ్రహారంలో వేంచేసి యున్న కనక దుర్గమ్మ సన్నిధిలో భక్తజన సందడి.. పసుపు,కుంకుమ, గాజులు,చీర, సారెలతో అమ్మవారికి ఘనంగా సమర్పణ.. .శ్రీ కనక దుర్గమ్మను ఇంటి ఇలవేల్పుగా, ఆడపడుచుగా భావిస్తూ ఆషాఢ మాసంలో పసుపు, కుంకుమలు, గాజులు,చీరలు,సారెలతో తరలి వచ్చిన మహిళా భక్తులతో ఆదివారం చెయ్యేరు అగ్రహారంలో భక్తి సందడి నెలకొంది... సమీప ప్రాంతాల నుంచి వచ్చిన మహిళా భక్తులు సంప్రదాయ బద్ధంగా పసుపు,కుంకుమలు, గాజులు,చీరలు,సారె సామగ్రిని తీసుకొచ్చి కనక దుర్గమ్మకు సమర్పించారు. ఆషాఢ సారే భక్తులకు ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.బాజా బజంత్రీలు, బాణాసంచా, వందలాది భక్తులతో అమ్మ వారి గుడి వరకు ఊరేగింపుగా తరలి వచ్చారు,అమ్మవారి ఆశీర్వచనం కల్పించడంతో పాటు సారె సమర్పణకు వచ్చిన భక్తులకు ఉచిత ప్రసాదాలను అందించారు.

# నవజాత శిశువు ఆరోగ్యానికి శ్రీరామ

- తల్లి ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకా



కాట్రేనికోన ఆగష్టు 9 మనం ప్రతినిధి : అద్భుతమైన పోషక విలువలు ఉన్న తల్లి ముర్రు పాలు బిడ్డకు మొదటి టీకా వంటిదని ముమ్మిడివరం మహిళ శిశు సంక్షేమ శాఖ సిడిపిఓ ముదునూరి నిహారిక హితవు పలికారు. నవజాత శిశువు ఆరోగ్యవంతమైన జీవితానికి తల్లి ముర్రుపాలు శ్రేష్ఠమైనవని వైద్యులు తెలుపుతున్నారు. తల్లి ముర్రుపాలలో అద్భుతమైన పోషక విలువలు ఉన్నాయన్నారు. బిడ్డ ఆరోగ్యవంతంగా ఎదురుగుదలకు, ఆయుస్సు పెంచేందుకు తల్లి ముర్రుపాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ఆరోగ్యవంతమైనకు తల్లి పాలు అవశ్యకతను తల్లులకు అవగాహణ కల్పించేకు ప్రతి ఏటా వారోత్సవాలను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్ వాడీ కేంద్రాల ద్వారా ప్రతి ఏటా తల్లి వాల వారోత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తుంది. మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు ముమ్మిడివరం కేంద్రంగా ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం మండలాలలో 10 సెక్టార్లు పరిధిలో 252 అంగన్ వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయి. అంగన్ వాడీ కేంద్రాలలో చిన్నారులకు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తుంది. అంగన్ వాడీ కేంద్రాల పరిధిలో చిన్నారులకు, కౌమార బాలికలకు, గర్భవతులు, బాలింతలకు పౌష్టికాహారంను అందజేస్తున్నారు.

**తల్లి పాలు బిడ్డకు శ్రీరామ రక్ష :**

నవజాత శిశువుకు కచ్చితంగా ఆరు నెలలు పాటు పోషక విలువలు ఉన్న తల్లి ముర్రుపాలు అందించాలని, తల్లిపాలు బిడ్డ ఆరోగ్యంనకు శ్రీరామ రక్ష వంటిదన్నారు. అనేక పోషక విలువలుతో ఉన్న తల్లి ముర్రు పాలు పసుపు రంగులో చిక్కగా ఉండి అధిక ప్రోటీన్లును కలిగి ఉంటాయని డా. భావన అన్నారు. తల్లి బిడ్డకు పాలు ఆహారంగా అందించడం ద్వారా మహిళలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. మహిళల్లో వచ్చే ప్రధానమైన ఆరోగ్య సమస్య బెస్ట్ క్యానర్కు ఆస్కారం లేదు. అత్యంత పౌష్టిక విలువలు ఉన్న ముర్రు పాలును బిడ్డకు పట్టించడం ద్వారా రోగ నిరోధక శక్తిని తట్టుకునే ఆరోగ్య వంతమైన బిడ్డకు జన్మను ఇస్తారు. తల్లి ముర్రు పాలు రోగాలను ఎదుర్కొనే శక్తి, శిశువు వయస్సుకు తగిన విధంగా పెరుగుదల తల్లి పాలలో ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. పుట్టిన బిడ్డకు తల్లి పాలు ఆరు నెల పాటు ఆహారంగా అందిస్తే తేలికగా జీర్ణం అవుతుంది. బిడ్డ మానసిక శారీరక వికాసానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. బిడ్డకు ఆస్తమా, శ్వాస కోశ వ్యాధులు, చర్మవాధులను దరిచేరనీయవు. బిడ్డకు తల్లిపాలు అందించడం, రోగ నిరోధక శక్తి కలిగి నవజాత శిశువు పెరుగుదలకు కీలయ పాత్ర పోషిస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

# కూటమి పాలనపై అసంతృప్తి వైసీపీలోకి భారీగా టీడీపీ శ్రేణులు వలస

- సత్యవరంలో రంగనాథరాజు సమక్షంలో భారీ చేరికలు.
- ప్రభుత్వ పనితీరుపై అసంతృప్తితోనే వైసీపీలో చేరుతున్నామన్ననాయకులు



పెనుమంట్ర, ఆగస్టు 9, మనం న్యూస్: పెనుమంట్ర మండలం సత్యవరం గ్రామంలో తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. తూర్పాలం క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర మాజీ మంత్రి, పీఏసీ సభ్యులు చెరుకువాడ శ్రీ రంగనాథరాజు ఆధ్వర్యంలో ఈ చేరికల కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వ పాలనపై అసంతృప్తితోనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు. టీడీపీ మాజీ అధ్యక్షులు, సత్యవరం గ్రామ మాజీ సర్పంచ్ స్వర్గీయ చుక్క అప్పారావు సోదరుడు చుక్క శ్రీను, ఆయన సతీమణి పుష్పలత, తనయుడు గౌతమ్ కుమార్ కుటుంబ సమేతంగా వైసీపీలో చేరారు.

అలాగే టీడీపీ గ్రామ ఎస్సీ సెల్ అధ్యక్షులు గెడ్డం విఘ్నేశ్వరులు, కుక్కల సూర్యనారాయణ, చెల్లుబోయిన శ్రీను, కట్టా వెంకటేశ్వర్లు, ముప్పిడి మోషే, గుబ్బల రామకృష్ణ, కట్టా మురళి, చొక్కాకుల నాగులు, మంగం మారేషు, కండవల్లి సురేష్, మంగం చిన్న వెంకటరావు తదితరులు తమ అనుచరులు, కార్యకర్తలతో కలిసి వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై ఆశించిన స్థాయిలో దృష్టి సారించడం లేదని, ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో అసంతృప్తి నెలకొందని విమర్శించారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కనిపిస్తోందని, రంగనాథరాజు నాయకత్వంపై నమ్మకంతోనే పార్టీలో చేరుతున్నామని తెలిపారు. అనంతరం రంగనాథరాజు మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం కల్పిస్తామని, గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ గూడూరి దేవేంద్రుడు, ఎంపీటీసీ సభ్యులు గెడ్డం ఈశ్వర్, గ్రామ పార్టీ అధ్యక్షులు తమనంపూడి పల్లారెడ్డి, కమలంపూడి సూర్య, వెంకట గణేష్రెడ్డి, శరణం అయ్యప్పరెడ్డి, గెడ్డం నందీశ్వరరావు, పిట్టా నరేష్కుమార్, వీరవల్లి నరసింహస్వామి, పాల శ్రీను, కోట గోవిందు, కుక్కల వెంకటరత్నం, పోడూరు జడ్పీటీసీ గుంటూరు పెద్దిరాజు, ఆచంట మండల కన్వీనర్ జకంశెట్టి శ్రీరాములు, పోతుమూడి రామచంద్రరావు, గుబ్బల వీరబ్రహ్మం, మేడిచర్ల పండు, దాట్ల చంటిరాజు, బుర్ర రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బాలవికాస కేంద్రాల ద్వారా పిల్లల్లో సంస్కారం పెరగాలి

ప్రత్తిపాడు ఆగస్టు 9 మనం న్యూస్: పిల్లలకు చిన్నప్పటి నుండే చదువుతో పాటు సంస్కారం నేరిపించాలని దాని కోసం సమరసత సేవా ఫౌండేషన్ విశేషమైన కృషి చేస్తుందని జిల్లా ధర్మ ప్రచారక్ పడాల రఘు తెలిపారు. ప్రత్తిపాడు మండలం రాచపల్లి శ్రీ రమణ మహర్షి సేవాశ్రమంలో జరిగిన జిల్లా బాల వికాస కేంద్రాల అభ్యాసవర్గలో పాల్గొని మాట్లాడారు. తిరుమల తిరుపతి దేవస్థానం నిధులు తో ఎస్సీ ఎస్టీ మత్స్యకార ప్రాంతాలలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మాణం జరిగిన దేవాలయాలలో బాల వికాస కేంద్రాలు ఏర్పాటు చేసామని వాటి ద్వారా పిల్లల్లో చదువు ఆట పాటలతో పాటు సంస్కారం నేరిపిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాల వికాస కేంద్రాల సహ ప్రముఖ నాగ వేణి, జిల్లా పరియోజన ప్రముఖ కొప్పన కోటేశ్వరరావు, ప్రత్తిపాడు ఖండ కన్వీనర్ తోలేటి రామకృష్ణ, ఖండ ధర్మ ప్రచారక్ బుడంక్కాయల పేర్రాజు బాల వికాస కేంద్రాల మాతాజీలు పాల్గొన్నారు.



## కొత్తపాలెంలో సత్తెమ్మ అమ్మవారికి ఆషాడం సారే



కాట్రేనికోన ఆగష్టు 9 మనం ప్రతినిధి : కాట్రేనికోన పంచాయతీ పరిధిలోని కొత్తపాలెం గ్రామంలో సుంకర వారి సత్తెమ్మ అమ్మవారికి ఆదివారం ఆషాడం సారే సమర్పించారు. నీటి సంఘం డైరెక్టర్ సుంకర బుజ్జి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.సారెలో భాగంగా భక్తులు పిండి వంటలు, మిఠాయిలు, చలిమిడి, పానకం, చీర, రవీకే, పసుపు, కుంకుమ, గాజులు, స్వీట్లు అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. నీటి సంఘం డైరెక్టర్ సుంకర పవిత్ర కుమార్, విలేకరి రాజు, వంగ దుర్గబాబు, రవిరాజు,సుంకర శ్రీనుబాబు, సుంకర సత్యనారాయణ, యర్రంశెట్టి లక్ష్మణరావు, బడేటి గణేష్, నంద్యాల నాగేశ్వరరావు, వాసం సత్యనారాయణ, దుర్గారావు, ఎం . వి . ఎల్ . ఎన్ . మూర్తి, ఎలుబండి సత్యనారాయణ, అంగరి వీర వెంకట సత్యనారాయణ, వీరబాబు, మట్టా నారాయణరావు, దుళ్ల యేసు, పసర దొరబాబు, పెసర సినారె తదితరులు ఈ పాల్గొన్నారు.

# ప్రత్తిపాడులో ఘనంగా మహేష్ బాబు జన్మదిన వేడుకలు



ప్రత్తిపాడు ఆగస్టు 9 మనం న్యూస్: నియోజవర్గ కేంద్రమైన ప్రత్తిపాడు లో సినీ నటుడు, 'సూపర్ స్టార్' మహేష్ బాబు 51వ జన్మదిన వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. సూపర్ స్టార్ కృష్ణ, మహేష్ బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సలాది కృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా స్థానిక దేవాలయంలో మహేష్ బాబు ఆయురారోగ్యాలతో, మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ అభిమానులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అభిమానుల మధ్య కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

**సామాజిక సేవా కార్యక్రమాలు..**

పుట్టినరోజు వేడుకల్లో భాగంగా అభిమానులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి తమ ఉదారతను చాటుకున్నారు. స్థానిక జాతీయ రహదారి సమీపంలోని పాదాలమ్మ గుడి వద్ద ఉన్న 'శారద వయోవృద్ధ ఆశ్రమం'లో వృద్ధులకు రొట్టెలు, పండ్లు మరియు చలి దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాన్స్, అభిమానులు వేగి దుర్గారావు, సువర్ణం విజయశేఖర్, తాతపూడి అనిల్ కుమార్, అరిగి కృష్ణ, కాతేటి ఉపేంద్ర, కాపరపు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# రత్నగిరిపై 'ప్రసాద్' పథకం పనుల పరిశీలన

- నాణ్యతలో రాజీ వద్దు.. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి
- ఈవో నల్లం సూర్య చక్రధర్ రావు

అన్నవరం, ఆగస్టు 9, మనం న్యూస్ : అన్నవరం రత్నగిరి కొండపై కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రసాద్' (ౘఖఅఖిఅౢ) పథకం నిధుల భాగస్వామ్యంతో శరవేగంగా నిర్మాణంలో ఉన్న నూతన అన్నదాన భవనం పనులను అధికారులు ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఈవో నల్లం సూర్య చక్రధర్ రావు ఆధ్వర్యంలో ప్రభుత్వ సాంకేతిక సలహాదారు, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్, టూరిజం, దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు తదితరులు నిర్మాణ పనులను పరిశీలించారు. భవన నిర్మాణంలో జరుగుతున్న వివిధ దశల పనులను పరిశీలించి, పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. నిర్మాణ పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యతా ప్రమాణాల్లో రాజీ పడకూడదని, నిర్ణీత ప్రమాణాల ప్రకారం పనులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. భక్తుల సౌకర్యాన్ని ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని భవన నిర్మాణం చేపట్టాలని తెలిపారు. రత్నగిరికి ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో నూతన అన్నదాన భవనం అందుబాటులోకి వస్తే భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. నిర్మాణ పనులను నిర్దేశిత ప్రమాణాలు, నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం, టూరిజం శాఖలకు చెందిన ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# భక్తి పేరుతో వ్యాపారం వద్దు

- ఆవునేతి దీపాల విక్రయాలపై ఈవో తనిఖీ.. నాణ్యత లోపిస్తే చర్యలు
- భక్తుల మనోభావాలకు ప్రాధాన్యం..
- ఆలయ పవిత్రతను కాపాడాలని అధికారుల సూచన



అన్నవరం, ఆగస్టు 9, మనం న్యూస్ : అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి వచ్చే భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఎటువంటి వ్యాపార కార్యకలాపాలు సాగకూడదని దేవస్థానం కార్యనిర్వహణాధికారి నల్లం సూర్యచక్రధర్ రావు స్పష్టం చేశారు. రత్నగిరిపై తూర్పు రాజగోపురం ఎదురుగా ఉన్న ఆవునేతి దీపాల విక్రయ దుకాణాన్ని ఆదివారం ఆయన తనిఖీ చేశారు. స్వామివారి దర్శనం అనంతరం భక్తులు ఎంతో ఆధ్యాత్మిక భావనతో రావిచెట్టు వద్ద ఆవునేతి దీపాలను వెలిగించడం ఆనవాయితీగా వస్తోంది. భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక విశ్వాసంతో నిర్వహించే ఈ కార్యక్రమంలో ఉపయోగించే దీపాల వత్తులు, ఆవునేత తదితర సామగ్రి విషయంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఈవో సూచించారు.

## మట్లమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో ఆషాఢ సారె



- కృష్ణవరంలో ఘనంగా మహిళల శోభాయాత్ర

కిర్లంపూడి ఆగష్టు 09:( మనం న్యూస్ ): కిర్లంపూడి మండలం కృష్ణవరం గ్రామంలో గ్రామదేవత మట్లమ్మ తల్లికి ఆదివారం మహిళలు భక్తిశ్రద్ధలతో ఆషాఢ సారె సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయబద్ధంగా పట్టుచీర, సారెను అమ్మవారికి సమర్పించారు. మంగళవాయిద్యాలు, ఆధ్యాత్మిక జెండాలతో గ్రామంలోని పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. 'ఓం శ్రీమాత్రే నమః', 'ఓం నమశ్శివాయ', 'జై శ్రీరామ్' నామస్మరణలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అనంతరం భక్తులు మట్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

# విత్తన బంతులతో పచ్చదనానికి బాటలు



- ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గం, ఆగస్టు 9 మనం న్యూస్, ప్రకృతిని పరిరక్షించుకుంటేనే భావితరాలకు బంగారు భవిష్యత్తును అందించగలమని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. పర్యావరణ పరిరక్షణతో భూతాపాన్ని తగ్గించడంతో పాటు వాతావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. రాయదుర్గం పట్టణంలోని నగరవనంలో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్రామ వికాస్' కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యదర్శి సోమా నీలకంఠ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు స్వయంగా తయారు చేసిన సుమారు 15 వేల విత్తన బంతులను నగరవనంలోని వివిధ ప్రాంతాల్లో చల్లారు. వేప, అల్లనేరేడు, ఇతర పండ్ల జాతులతో పాటు అటవీ జాతుల విత్తనాలను విత్తన బంతుల ద్వారా నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్న వయసు నుంచే విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. అడవుల తగ్గుదల, పచ్చదనం క్షీణత, వాతావరణ కాలుష్యం భూతాపం పెరగడానికి ప్రధాన కారణాలని తెలిపారు. అవసరాలకు మించి ప్రకృతి వనరులను దోచుకోవడం వల్ల భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

# మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా భోజనం పొట్లాలు పంపిణీ చేసిన జుత్తుల శ్రీను



ఏలేశ్వరం,ఆగస్టు 09;;(మనం న్యూస్) : ఏలేశ్వరం పట్టణంలో సిని హీరో ఘట్టమనేని మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు బొదిరెడ్డి గోపి వీర అభిమాని జుత్తుల శ్రీను వృద్ధులకు,బిక్షాటన చేసే వారికి వివేకనంద సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో భోజనం పొట్లాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వివేకానంద సేవా సమితి పట్టణ ఇంచార్జ్ పెండ్యాల రాజు,పసుపులేటి శ్రీను మీడియాతో మాట్లాడుతూ సినీ యాక్టర్ మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా జుత్తుల శ్రీను సుమారు 50 మంది వృద్ధులకు నిరుపేదలకు భోజనం పొట్లాలను అందజేశారు.అలాగే గత 20 సంవత్సరాల నుంచి మహేష్ బాబు పుట్టినరోజున అనేక సేవా కార్యక్రమాలు చేయడం జరుగుతుందని, మహేష్ బాబు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి సభ్యులు,మహేష్ బాబు అభిమానులు పాల్గొన్నారు.

## దివాసీల సమస్యల పరిష్కారానికి కృషి



ప్రత్తిపాడు ఆగస్టు 09 మనం న్యూస్: మండలంలో పాండవులపాలెం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఆనందోత్సవాల నడుమ నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు ముఖ్య అతిథులుగా హాజరయ్యా రు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రత్యేక అధికారి (డిప్యూటీ కలెక్టర్) ఏ శ్రీనివాసరావు, పెద్దాపురం ఆర్డీవో పి కృష్ణమూర్తి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఎన్ నాగమల్లేశ్వర రావు, తహశీల్దార్ ఎం సూర్యప్రభ, మండల అభివృద్ధి అధికారి ఎంవిఆర్ కుమార్ బాబు, మండల విద్యాశాఖ అధికారి వి రాజబాబు తదితరు లు విచ్చేసి విద్యార్థులను ఉత్సాహపరిచారు.

# దాసరపల్లిలో ఇంటింటి కార్యక్రమం



గుడిబండ ఆగస్టు 9 మనం న్యూస్: గుడిబండ మండలం దాసరి పల్లి గ్రామంలో స్థానిక నాయకులు బెంగళూరు చిత్తప్ప,నాగభూషణ్ ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటి కార్యక్రమం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సమితి సభ్యులు శ్రీనివాసమూర్తి ఆదేశాల మేరకు దాసరిపల్లి గ్రామంలో స్థానిక నాయకులు ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రతి కుటుంబాన్ని పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ అదే విధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలు అందని అర్హుల వివరాలను సేకరించారు.ప్రజల నుంచి వచ్చిన సమస్యలను సంబంధిత అధికారులు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఇప్పటికే దాసరపల్లి గ్రామంలో తాగునీటి సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి బోర్ బావులను తవ్వి తాగనీటి సమస్యను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాగభూషణ్, పాండురంగప్ప, జయన్న, కె శివన్న ,నారాయణప్ప, రంగప్ప, ఫీల్ అసిస్టెంట్ శివన్న, డి చితప్ప, వేమరాజు, గోవిందప్ప, బాలన్న, కెంచప్ప, నాగప్ప, చంద్రప్ప, గంగప్ప ,కరికెర మంజు తదితరులు పాల్గొన్నారు.

# సాహిత్యవిమర్శను శాస్త్రీయ స్థాయికి తీసుకుపోవాలి

- నెల్లుట్ల వేణుగోపాల్
- మానవ సంబంధాల చిత్రణే సాహిత్యం : ఆచార్య రాచపాలెం
- ముగిసిన అరసం సాహిత్య విమర్శ – పాఠశాల




అనంతపురం, ఆగష్టు 9 మనంన్యూస్ : సాహిత్య విమర్శ ఒక మేధోప్రక్రియ, చర్చ, సంవాదం లాంటిదని, అభ్యుదయవాదులు సమిష్టికృషితో విమర్శను శాస్త్రీయ స్థాయికి తీసుకెళ్లాలని ప్రముఖ సాహితీవేత్త వీక్షణం పత్రిక సంపాదకులు నెల్లుట్ల వేణుగోపాల్ అన్నారు. సమాజాన్ని పరావర్తనం చెందించేదే సాహిత్యమన్నారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) అనంతపురం జిల్లా శాఖ ఆధ్వర్యంలో సాహిత్య విమర్శ - పాఠశాల రెండు రోజులపాటు ఘనంగా సాగింది. ఆర్డీటి ఎకాలజీ సెంటర్లో ఆదివారం జరిగిన తరగతులకు, సభలకు, అరసం జిల్లా అధ్యక్షులు భీమిరెడ్డి ఈశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు.

సాహిత్య విమర్శ - విభిన్న ధోరణులు, మార్క్సిస్ట్ సాహిత్య విమర్శ అనే అంశాలపై ఎన్. వేణుగోపాల్ సుదీర్ఘంగా ఉపన్యసించారు. సాహిత్య విమర్శ వికాసం అనే అంశంపై అరసం రాష్ట్ర అధ్యక్షులు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడారు. ప్రముఖ కవి, విమర్శకులు తూముచర్ల రాజారామ్ విమర్శకుని అనుభవాలు చక్కగా వివరించారు. వేణుగోపాల్ మాట్లాడుతూ, సాహిత్య విమర్శకులు విస్తృత అధ్యయనం, నిరంతర సాధన కొనసాగించాలన్నారు.

## రుద్రప్పకు అడివప్ప నివాళి



కౌతాళం, ఆగష్టు 09 మనం న్యూస్ః కౌతాళం మండలంలోని కామవరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ మాజీ జడ్పీటీసీ రుద్రప్ప కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నిన్న హఠాన్మరణం చెందడం జరిగింది. విషయం తెలిసిన వెంటనే తెదేపా రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి అడివప్ప గౌడ్ కామవరంలోని వారి స్వగృహానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెదేపా రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి అడివప్ప గౌడ్ తెలిపారు.

## మాచాపురంలో జోరుగా టీడీపీ ఇంటింటి ప్రచారం



నందవరం ఆగష్టు 9 మనం న్యూస్ః నందవరం మండల పరిధిలోనే స్థానిక మాచాపురం గ్రామంలో జోరుగా టీడీపీ ఇంటింటి ప్రచారం టిడిపి మండల అధ్యక్షులు కాసింవలి మాట్లాడుతూ ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బి వి జయ నాగేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేయడం జరిగింది . టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారంగా నిరుపేదలకు ఉద్యోగాలు అందించారు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలను సూపర్ సక్సెస్ చేసినాడని తెలియజేశారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే లక్ష్యంతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ బడే సబ్ గ్రామ టిడిపి నాయకులు పాల్గొన్నార

## బుచ్చమ్మ తోటలో తనిఖీలు



మహానంది, ఆగస్టు9,మనంన్యూస్: నంద్యాల జిల్లా మహానంది మండల పరిధిలోని బుచ్చమ్మ తోటలో పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఆదివారం జిల్లా ఎస్ పి సునీల్ షోరాన్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్ పి సుస్మిత ఆధ్వర్యంలో ఎస్ ఐ రామ్మోహన్ రెడ్డి,పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసులు కార్డన్ అండ్ సర్చ్ కార్యక్రమంలో భాగంగా తనిఖీలు నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాలలో ,అనుమానాస్పద ప్రాంతాలలో తనిఖీలు చేపట్టారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## మెగా డీఎస్సీపై మాట్లాడే అర్హత జగన్‌కు లేదు



గడివేముల, ఆగష్టు 9మనం న్యూస్ః మెగా డీఎస్సీ గురించి మాట్లాడే నైతిక అర్హత మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డికి లేదని టిడిపి సీనియర్ నాయకులు మాజీ మండల అధ్యక్షులు వంగాల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ రెడ్డి ఓటమిపాలైన తరువాత పిచ్చి పరాకాష్టకు చేరిందని, జన్ జి పేరుతో మెగా డీఎస్సీ పై గొడ్డలి పార్టీలోని వారంతా సైకోల వ్యవహరిస్తున్నారని అన్నారు. జగన్కు చెందిన రాజకీయ పార్టీ ముసుగులో క్రిమినల్స్ తయారు చేయడం వారిని పోలీసులు అరెస్టు చేస్తే ఓదార్పు పేరుతో ప్రజలను బలి చేయడం జగన్ రెడ్డి కు అలవాటుగా మారిందని మాజీ మండల అధ్యక్షులు వంగాల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మెగా డీఎస్సీ పరీక్షలకు వెళ్లిన విద్యార్థులు ఎవరు కాకుండా వైసిపి కార్యకర్తలు ధర్నాలు చేయడం హాస్య స్పందంగా ఉందని అన్నారు. మెగా డీఎస్సీ పరీక్షలు పారదర్శకంగా జరిగాయని, ప్రతిదానికి రిజర్వేషన్ ప్రకారంగా ఉద్యోగాలు ఇచ్చామని, వాస్తవాలు చూపించినప్పటికీ, దీని తర్వాత స్పోరట్స్ కోటలో అక్రమాలు జరిగాయని, వైసిపి నాయకులు హైకోర్టు ఫీల్ వేసిన దానికి ప్రాథమిక ఆధారాలు చూపించకుండా, ఇటువంటి ఫిల్ వల్ల కోర్టుకు విలువైన సమయం వృధా అవుతుందని గట్టిగా మొట్టికాయలు పెట్టినప్పటికీ వీరికి సిగ్గు లేదని అన్నారు. విద్యా శాఖ మంత్రి లోకేష్ ను రాజీనామా చెయ్యమనడం నీతి మాలిన చర్యని మండిపడ్డారు.

## కామవరం టీడీపీ మాజీ జడ్పీటీసీ రుద్రప్ప కన్నుమూత



కౌతాళం, ఆగష్టు 09 మనం న్యూస్: కౌతాళం మండలం కామవరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ మాజీ జడ్పీటీసీ రుద్రప్ప కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నిన్న హఠాన్మరణం చెందడం జరిగింది.వారి మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ చెన్న బసప్ప మరియు ఉరుకుంద కొట్రేష్ గౌడ్ మరియు రాజబాబు కామవరంలోని వారి స్వగృహానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## విద్య ప్రైవేటీకరణ- కాషాయీకరణను తిప్పికొడతాం




కర్నూలు ఆగస్ట్ 09మనం న్యూస్ : ఐసా - సిపిఐ (ఎమ్ ఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో రాయలసీమ యూనివర్సిటీలో ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ 36 వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా విక్టరీ మార్చ్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎమ్ ఎల్) లిబరేషన్ జిల్లా కమిటీ సభ్యులు కామ్రేడ్ రసూల్, ఐసా రాష్ట్ర కార్యదర్శి స్వామిదాసుగారి నాగార్జున పాల్గొని జెండా ఆవిష్కరించారు...విద్య, ప్రగతి, ప్రజాస్వామ్యం లక్ష్యాలతో 1990 ఆగస్ట్ 9 ఉత్తరప్రదేశ్ అలహాబాద్ లో ఏర్పడిన ఐసా నేటికి 36 సంవత్సరాలు పూర్తి చేసుకుని దేశవ్యాప్తంగా విద్యార్థుల హక్కుల కోసం నిరంతర పోరాటాలను నిర్మిస్తోందన్నారు. భగత్సింగ్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కలలుగన్న సమానత్వ సమాజ లక్ష్యాలను కామ్రేడ్ చంద్రశేఖర్ విప్లవ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఐసా కృషి చేస్తోంది.పేద, మధ్యతరగతి, అణగారిన వర్గాల విద్యార్థులకు విద్యను అందుబాటులో ఉంచేందుకు, ప్రభుత్వ విద్యను పరిరక్షించేందుకు ఐసా ముందుండి పోరాడుతోందని తెలిపారు.

## రుద్రప్ప నివాళ్లర్పించిన వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షులు



కౌతాళం,ఆగష్టు 09 మనం న్యూస్ : కౌతాళం మండలం కామవరం గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ రుద్రప్ప కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నిన్న హఠాన్మరణం చెందడం జరిగింది.వారి మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ కామవరంలోని వారి స్వగృహానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కామవరం మహేంద్ర రెడ్డి కౌతాళం వైసీపీ మండలం కన్వీనర్ దేశాయి ప్రహ్లాద ఆచారి,వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి,మాజీ సర్పంచ్ పాల్ దినకర్, సక్రితిక్కయ్య,వడ్డే రాము,అవతారం మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీపై వైసీపీ నేతలకు ఎందుకీ అక్కసు



నందవర, ఆగష్టు 9 మనం న్యూస్ః నందవరం మండల పరిధిలోని స్థానిక మాచాపురం గ్రామంలో టిడిపి మండల కన్వీనర్ ఖాసింవలి ఇంటి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బి వి జయ నాగేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు మెగా ఢిఇ ద్వారా యువతకు ఉద్యోగాలు వస్తుంటే వైసీపీ నేతలకు ఎందుకు కడుపుమంట. ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన యువతను అభినందించడాన్ని కూడా రాజకీయంగా చూడటం వైసీపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం అని విమర్శించారు. యువతకు ఉద్యోగాలు రావడం చూసి సంతోషించాల్సింది పోయి, రాజకీయ బురద జల్లడం వైసీపీకి అలవాటుగా మారింది. గత ప్రభుత్వ హయాంలో యువత ఎదుర్కొన్న నిరాశను ప్రజలు మర్చిపోలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంటే, దాన్ని కూడా జీర్ణించుకోలేక విమర్శలు చేయడం వారి అసహనాన్ని బయటపెడుతోందన్నారు.

## సూట్ రూమ్ నిర్మాణానికి 5.50లక్షల విరాళం



మహానంది, ఆగస్టు9,మనంన్యూస్ః మహానంది పుణ్యక్షేత్రం లో నిర్మాణం చేపట్టబోతున్న సూట్ రూమ్ ల నిర్మాణానికి దాత ముందుకు వచ్చినట్లు ఆలయ కార్య నిర్వాహనాదికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం హైదరాబాద్ కు చెందిన యలమంచిలి నవీన్, నాగిని దంపతులు వసతి గృహనిర్మాణానికి 5లక్షల 50 వేల రూపాయలు ఈఓ శ్రీనివాస రెడ్డి, చైర్మన్ నరాల చంద్రమౌళీశ్వర రెడ్డి,పాలక మండలి సభ్యుల ఆధ్వర్యంలో అందజేశారు.15లక్షల సూట్ రూమ్ నిర్మాణానికి దాత ముందస్తుగా ఈ నగదును అందజేసినట్లు తెలిపారు. దాత దంపతులను ఆశీర్వదించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతలు, భక్తులు ముందుకు వచ్చి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వర శర్మ, హనుమంతు శర్మ, ఏ ఈఓ మధు, సూపర్డెంట్ శశిధర్ రెడ్డి, నీలఖంటేశ్వర రాజు,టెంపుల్ ఇన్స్పెక్టర్ మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి అండ



- ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గం ఆగష్టు 9 మనం న్యూస్: పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం రాయదుర్గం పట్టణంలోని 31వ వార్డులో నిర్వహించిన 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాయదుర్గం పట్టణంలో అధిక సంఖ్యలో చేనేత కార్మికులు 'నేతన్న సేవలో' పథకానికి అర్హత సాధించడం సంతోషకరమన్నారు. అర్హులైన చేనేత కార్మికులకు ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం మంజూరైందని, సోమవారం వారి బ్యాంకు ఖాతాల్లో జమ కానుందని తెలిపారు. పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రభుత్వం సామాజిక భద్రతా పింఛన్ల ద్వారా అండగా నిలుస్తోందన్నారు. ఏడాదికి మూడు ఉచిత వంటగ్యాస్ సిలిండర్లు, 'తల్లికి వందనం' పథకం ద్వారా విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు వివరించారు. సంక్షేమ పథకాలతో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణమూర్తి, వార్డు ఇన్చార్జి ఎల్లప్ప తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కామేశ్వరి అమ్మవారికి సారె చీర



మహానంది, ఆగస్టు9,మనంన్యూస్ః మహానంది క్షేత్రంలో వెలసిన శ్రీ కామేశ్వరి దేవి అమ్మవారికి నంద్యాల కు చెందిన వాసవి మహిళా మండలి సేవాసమితి సభ్యులు సారె చీరను అందజేశారు. ఆశాడ మాసం సందర్భంగా నంద్యాల కు చెందిన వాసవి మహిళా మండలి అధ్యక్షురాలు తాడువాయి ఇందుమతి ఆధ్వర్యంలో దాదాపు 80మంది మహిళలు పాల్గొని చీర, సారేతో పాటు పిండి వంటలను సమర్పించారు. అలాగే స్వామివారికి, సీతారాముల వారికి వస్త్రాలను సమర్పించారు. నంది మండలంలో ఏర్పడిన నవనందులను దర్శించుకుంటు సారె చీరను భక్తి శ్రద్ధలతో సమర్పించారు.అంతకుముందు మహానంది క్షేత్రానికి చేరుకున్న వీరికి సూపర్డెంట్ శశిధర్ రెడ్డి, ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వర శర్మ లు స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో శోభారాణి, సువర్ణా, రాధకుమారి, మనోహరి, సరిత, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి పాటుపడతాం



మహానంది, ఆగస్టు9, మనంన్యూస్: మహానంది దేవస్థానం అభివృద్ధికి తమశక్తి మేరకు పాటు పడతామని పాలక మండలి చైర్మన్ నరాల చంద్ర మౌళీశ్వర రెడ్డి తో పాటు సభ్యులు తెలిపారు.నూతనంగా ప్రమాణ స్వీకారోత్సవం చేసిన పాలక మండలి సభ్యులు ఆదివారం మొదటి సారిగా ఈఓ శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో పరిచయ కార్యక్రమంతో పాటు ఆలయ అభివృద్ధి పై సమావేశం నిర్వహించారు. అంతకు ముందు శ్రీకామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు చైర్మన్ గా నరాల చంద్ర మౌళీశ్వర రెడ్డిని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఈఓ మధు, సూపర్డెన్స్ శశిధర్ రెడ్డి, నీల ఖంటేశ్వర రాజు, సుబ్బారెడ్డి, మల్లయ్య,మహానంది మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కంచర్ల శివ శంకర చౌదరి, మాజీ ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున శెట్టి, బిసి సంక్షేమ సంగం నాయకులు లక్ష్మీ నారాయణ గౌడ్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

## లోకేష్ రాజీనామా చేయాలి..



- డీఎస్సీపై సీబీఐ విచారణ జరపాలి
- సవితపై ఉష్శ్రీ చరణ్ ఫైర్!

గోరంట్ల, ఆగష్టు 9 మనం న్యూస్: డీఎస్సీ-2025 నియామకాల్లో అక్రమాలు, అవకతవకలపై సమగ్ర సీబీఐ విచారణ జరపాలని, ఈ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గోరంట్లలో నిర్వహించిన భారీ నిరసన ర్యాలీ రాజకీయంగా వేడెక్కింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి, పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉష్శ్రీ చరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, డీఎస్సీ అభ్యర్థులు, నిరుద్యోగ యువత, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉష్శ్రీ చరణ్ అధికార పక్షంపై, ముఖ్యంగా మంత్రి సవిత, ఆమె అనుచరులపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం, అధికార పార్టీ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ నియామకాల విషయంలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని ఉష్శ్రీ చరణ్ డిమాండ్ చేశారు

## వర్షాలు సమృద్ధిగా కురవాలని శ్రీ కాటి కోటేశ్వర స్వామికి పాదయాత్ర

- మాల్యవంతం గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో పాదయాత్ర



బత్తలపల్లి, ఆగస్టు 8 మనం న్యూస్ : మండల పరిధిలోని మాల్యవంతం గ్రామ ప్రజలు వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు సస్యశ్యామలంగా ఉండాలని కోరుకుంటూ భక్తిశ్రద్ధలతో శ్రీ కాటి కోటేశ్వర స్వామి సన్నిధికి పాదయాత్ర నిర్వహించారు.శనివారం ఉదయం మాల్యవంతం గ్రామం నుంచి పాదయాత్ర ప్రారంభమై సాయంత్రానికి తాడిమర్రి మండలం చిల్ల కొండాయపల్లి మీదుగా చిల్లవారిపల్లి గ్రామంలోని శ్రీ కాటి కోటేశ్వర స్వామి సన్నిధికి చేరుకున్నారు. అక్కడ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, సమృద్ధిగా వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని, రైతులు, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం ఆదివారం ఉదయం స్వామివారి సన్నిధి నుంచి తిరుగు పాదయాత్రను ప్రారంభించారు. మార్గమధ్యంలోని గ్రామాల వద్ద భక్తులు భజనలు నిర్వహిస్తూ భక్తిశ్రద్ధలతో పాదయాత్ర కొనసాగించారు.తిరుగు పాదయాత్ర ఆదివారం సాయంత్రానికి బత్తలపల్లి మండలం మాల్యవంతం గ్రామానికి చేరుకుంది.ఈ సందర్భంగా మాల్యవంతం గ్రామ ప్రజలు మాట్లాడుతూ శ్రీకాటి కోటేశ్వరస్వామి ఆశీస్సులతో ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు బాగా పండి రైతులు సంతోషంగా ఉండాలని, గ్రామ ప్రజలందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నామని తెలిపారు.భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ పాదయాత్రలో మాల్యావంతం గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మీ కోసం కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోండి

- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

అనంతపురం, కలెక్టరేట్ ఆగస్టు 09 : మనం న్యూస్ : మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం .ఏపీ .గవర్నమెంట్ .ఇన్ (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాలలో 'మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్లైన్ నంబర్ 1100' అనే బ్యానర్ను ఏర్పాటు చేయాలన్నారు.

## డీఎస్పీ కౌన్సిలింగ్ ఒక్కటైన దంపతులు

**విడాకులు పొందిన జంటకు కొత్త జీవితం**
**అర్ధరాత్రి దాకా సహనంతో కౌన్సిలింగ్**
**ఇరు కుటుంబాల్లో వెల్లివిరిసిన ఆనందం**



ముదిగుబ్బ ఆగస్ట్ 9 మనంన్యూస్ః 'పోలీసు అధికారులు అనుకోవాలే కాని ఏదైనా సాధిస్తారనడానికి ఇదొక నిదర్శనం.. భార్యాభర్తల మధ్య మనస్పర్థలేర్పడి వారు విడాకుల కోసం కోర్టు మెట్లెక్కారు.. విచారించిన న్యాయస్థానం తప్పని పరిస్థితుల్లో విడాకులు మంజూరు చేసింది. దీంతో వారు ఎడబాటుగా జీవిస్తున్నారు. కొన్నాళ్ళకు మళ్లీ తన భర్తతో జీవితాన్ని ఆశించిన భార్య తమ గ్రామానికి వెళ్లిన డీఎస్పీ జనార్దన్ రావు దృష్టికి తీసుకెళ్ళింది. దీంతో మానవతా దృక్పథంతో వెంటనే స్పందించిన డీఎస్పీ దంపతులకు కలిపేందుకు చర్యలు తీసుకున్నారు. బెంగళూరులో నివసిస్తున్న ఆమె భర్తను ఇక్కడికి పిలిపించి తమదైన శైలిలో కౌన్సిల్లింగ్ ఇచ్చి వారిని ఒక్కటి చేసారు.... దీంతో ఇరు కుటుంబాల్లో అంతులేని ఆనంద క్షణాలు వెల్లివిరిసాయి. ఇలాంటి అరుదైన ఘటన ముదిగుబ్బ మండలంలో చోటుచేసుకుంది.

## గొంతెండుతోంది...నీటి కష్టాలు పట్టవా..?



- ప్రజల గోడు వినిపించదా..?

రాయదుర్గం ఆగష్టు 9 మనం న్యూస్, : పట్టణంలో తాగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రత రమవుతున్నా మున్సిపల్ యంత్రాంగం మాత్రం తాత్కాలిక చర్యలకే పరిమితమవుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కనేకల్ ఎస్.ఎస్. ట్యాంక్లో నీటిమట్టం అడుగంటడంతో ప్రస్తుతం చాలా తక్కువ మోతాదులోనే నీటిని పంపింగ్ చేస్తున్నామని మున్సిపల్ అధికారులు ప్రకటించారు. దీంతో పట్టణ ప్రజలకు అవసరమైన పరిమాణంలో నీటిని సరఫరా చేయడం సాధ్యం కావడం లేదని తెలిపారు. హెచ్.ఎల్.సి. కాలువకు నీరు వచ్చే వరకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తామని కమిషనర్ ప్రకటించారు. అయితే ప్రజలకు తాగునీరు అందించడంలో ముందస్తు ప్రణాళిక, ప్రత్యామ్నాయ నీటి వనరుల ఏర్పాటు, అత్యవసర చర్యలు ఎక్కడని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

# సిరాజ్ హ్యాట్రిక్ సిక్సర్స్.. టీమిండియా గెలుపు

శ్రీలంక క్రికెట్ ఎలెవెన్ తో జరిగిన మూడు రోజుల వార్మప్ మ్యాచ్ లో టీమిండియా 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. 207 పరుగుల లక్ష్యాన్ని భారత్ 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది.

తొలి ఇన్నింగ్స్ లో డకౌటైన యశస్వి జైస్వాల్ (61 రిటైర్డ్ హర్ట్) మెరుపు అర్ధ సెంచరీ చేసి భారత గెలుపుకు గట్టి పునాది వేశాడు. గాయం కారణంగా తొలి ఇన్నింగ్స్లో బ్యాటింగ్కు దిగని కెప్టెన్ శుభ్ మన్ గిల్ కీలక ఇన్నింగ్స్ (44) ఆడాడు. ఆఖర్లో సిరాజ్ (32 నాటౌట్; ఫోర్, 4 సిక్సర్లు) హ్యాట్రిక్ సిక్సర్స్ తో విరుచుకుపడి భారత్ను విజయతీరాలకు చేర్చాడు.

**టార్గెట్ 207**

లంక ఎలెవెన్ జట్టు రెండో ఇన్నింగ్స్ లో 6 వికెట్ల నష్టానికి 200 పరుగులు చేసి, టీమిండియా ముందు 207 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. నిషాన్ మధుష్క (63 రిటైర్డ్ హర్ట్) అర్ధ సెంచరీతో రాణించగా.. అంజల బండార (35), నిపున్ ధనంజయ (46) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. భారత బౌలర్లలో గుర్నూర్ బ్రార్, రవీంద్ర జడేజా తలో 2 వికెట్లు తీయగా.. సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ చెరో వికెట్ దక్కించుకున్నారు.

**పడిక్కల్ అజేయ శతకం**

భారత్ తొలి ఇన్నింగ్స్ను 357 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. దేవదత్ పడిక్కల్ (142 నాటౌట్) అజేయ సెంచరీతో సత్తా చాటాడు. రవీంద్ర జడేజా (63 రిటైర్డ్ హర్ట్) అర్ధ సెంచరీతో రాణించగా.. కేఎల్ రాహుల్ (40), మానవ్ సుతార్ (41), గుర్నూర్ బ్రార్ (36 నాటౌట్), సరాన్ష్ జైన్ (22 రిటైర్డ్ హర్ట్) ఓ మోస్తరు స్కోర్లతో పర్వాలేదనిపించారు. లంక బౌలర్లలో అసంక మనోజ్, రమేశ్ మెండిస్ తలో 2 వికెట్లు తీయగా.. విశ్వ ఫెర్నాండో, కేశర నువంత చెరో వికెట్ దక్కించుకున్నారు.

దీనికి ముందు శ్రీలంక తొలి ఇన్నింగ్స్ లో 8 వికెట్ల నష్టానికి 363 పరుగులు చేసి ఇన్నింగ్స్ ను డిక్లేర్ చేసింది. నిషాన్ మధుష్క (66), రవిందు రషాంత (71), సోనల్ దినుష (52) అర్ధ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్ తలో 2 వికెట్లు తీయగా.. బ్రార్ చెరో వికెట్ దక్కించుకున్నారు. కాగా, ఈ మ్యాచ్ తర్వాత భారత జట్టు శ్రీలంకతో రెండు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్ లోని తొలి టెస్ట్ మ్యాచ్ గాలే వేదికగా ఆగస్ట్ 15 నుంచి మొదలుకానుంది. రెండో టెస్ట్ కొలంబో వేదికగా ఆగస్ట్ 23న ప్రారంభం కానుంది.





# అప్పుడు కలవనివ్వలేదు.. ఇప్పుడు అదే హీరోతో!

మలయాళ నటి మమితా బైజు ప్రస్తుతం వరుస విజయాలతో మంచి జోష్ లో ఉంది. ప్రేమలు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది. 'డ్యూడ్' 'జన నాయకన్' చిత్రాలతో మరింత గుర్తింపు తెచ్చుకుంది. సూర్యతో కలిసి 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో ఈ శుక్రవారం(ఆగస్టు 14) ప్రేక్షకులను పలకరించనుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ కేరళలో శనివారం జరిగింది. ఇందులో మాట్లాడిన మమిత తన చిన్ననాటి జ్ఞాపకాలని గుర్తుచేసుకుంది.

'2015లో సూర్య ఓ కార్యక్రమం కోసం కొచ్చి వచ్చారు. అప్పుడు నేను ఎనిమిది, మా అన్నయ్య ఇంటర్ చదువుతున్నాం. సూర్యని చూసేందుకు అన్నయ్య తన స్నేహితులతో కలిసి కొచ్చి వెళ్లాడు. నేనూ వెళ్తానంటే మా తల్లిదండ్రులు పంపించలేదు. అన్నయ్య సూర్యతో ఫొటో దిగి చూపించాడు. నేను చాలా బాధపడ్డాను. ఇప్పుడు అదే హీరోతో కలిసి నటించే అవకాశం దక్కింది. ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్లో సూర్యతో కలిసి ఒకే వేదికపై నిలబడటం అదృష్టంగా భావిస్తున్నాను' అని మమిత చెప్పుకొచ్చింది. అభిమానిగా సూర్యని చూడాలనుకున్న తనకు.. ఇప్పుడు ఆయన సినిమాలో నటించే అవకాశం రావడం గొప్ప ఆశీర్వాదమని పేర్కొంది.

వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రం 45 ఏళ్ల వ్యక్తి 20 ఏళ్ల అమ్మాయితో ప్రేమలో పడటం అనే కాన్సెప్ట్తో తెరకెక్కించారు. ఇందులో రవీనా టాండన్, రాధికా శరత్కుమార్, నాజర్ తదితరులు కీలక పాత్రలు చేశారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతమందించాడు.

# వైభవ్‌కు నిజంగానే 15 ఏళ్లేనా? అనుమానాలపై బ్రెట్ లీ ఆసక్తికర కామెంట్స్

ప్రపంచ క్రికెట్ లో వైభవ్ సూర్యవంశీ హాట్ టాపిక్. కేవలం 15 ఏళ్లకే అంతర్జాతీయ క్రికెట్ లోకి అడుగు పెట్టాడు. ఈ క్రమంలో ఆసీస్ మాజీ స్టార్ పేసర్ బ్రెట్ లీ వైభవ్ టాలెంట్ పై ప్రశంసల వర్షం కురిపించాడు. సూర్యవంశీ వయసుపైనా బయట చాలా అనుమానాలు ఉన్నాయని వ్యాఖ్యానించాడు. కానీ, అతడి నైపుణ్యం, ఫామ్ ను చూస్తుంటే ముచ్చటేస్తోందని తెలిపాడు.

"వైభవ్ సూర్యవంశీ ఓ అద్భుతం. విదేశాల్లో చాలా మంది వైభవ్ వయసు గురించి ప్రశ్నిస్తూ ఉంటారు. అతడికి నిజంగానే 15 ఏళ్లేనా? ఎందుకంటే చూసేందుకు 17 లేదా 18 ఏళ్ల కుర్రాడిలా కనిపిస్తాడనేది వారి అభిప్రాయం. కానీ, నేనెప్పుడూ అతడి వయసు గురించి ఆలోచించలేదు. కేవలం బ్యాటింగ్ సత్తానే చూస్తా. అతడి ఏజ్ ఎంతైతే ఏంటి? కుర్రాడు అద్భుతమైన క్రికెట్ ఆడుతున్నాడు. భారత్ కు దొరికిన మంచి ఆటగాడు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరాలని ఆశిస్తున్నా. ఐపీఎల్ లోనే అతడి నైపుణ్యం ఏంటో చూశాం. సన్ రైజర్స్ పై 97 పరుగుల ఇన్నింగ్స్ సూపర్. ఆసీస్ కు చెందిన స్టార్ బౌలర్లపైనా విరుచుకుపడ్డాడు. క్రికెటింగ్ షాట్లకు పవర్ హిట్టింగ్ తోడైతే ఎలా ఉంటుందో అలా ఉంది. అయితే, అతడు ఇంకా చిన్న పిల్లాడే. లేనిపోని ఒత్తిడిని దరిచేరనీయొద్దు. హుక్ లేదా పుల్లర్ షాట్లను కొట్టే ఆటగాళ్లంటే నాకు ఇష్టం. వారికి బౌలింగ్ చేసేందుకు ఇష్టపడతా. పోటీ బాగుంటుంది. ఒక బంతికి సిక్స్ కొట్టినా నిరుత్సాహపడను. మళ్లీ అదే బాల్ వేసేందుకు ప్రయత్నిస్తా" అని బ్రెట్లీ స్పష్టం చేశాడు.



**బెస్ట్ బ్యాటర్ సచిన్.. బెస్ట్ క్రికెటర్ కలిస్**

"క్రికెట్ లో అత్యుత్తమ బ్యాటర్ ఎవరంటే మాత్రం సచిన్ తెందుల్కర్ అని ఎప్పుడో చెప్పా. కానీ, బెస్ట్ క్రికెటర్ మాత్రం దక్షిణాఫ్రికా మాజీ ఆల్‌రౌండర్ జాక్వెలిస్ కలిస్ అని చెబుతా. అతడి గణాంకాలే ఆ మాట చెబుతాయి. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో అద్భుతంగా రాణించాడు. ఎంతటి క్లిష్టపరిస్థితులైనా కలిస్ చాలా ప్రశాంతంగా ఉంటాడు" అని బ్రెట్ లీ తెలిపాడు.

# కియారాఅక్కడ కూడా అడుగు పెట్టనుందా?



భారతీయ సినిమాలో కోలీవుడ్ సినిమా ప్రత్యేక స్థానానికి చేరుకుంది. పలు తమిళ సినిమాలు ప్రపంచవ్యాప్తంగా వసూళ్ల వర్షం కురిపిస్తున్నాయి. అందుకే పలువురు ప్రముఖ బాలీవుడ్ బ్యూటీలు తమిళంలో నటించడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఇప్పటికే ప్రియాంక చోప్రా నుంచి ఐశ్వర్యారాయ్, దిశా పటానీ వరకు పలువురు ఉత్తరాది భామలు తమిళ చిత్రాలు చేశారు. తాజాగా మరో టాప్ హీరోయిన్ దృష్టి కోలీవుడ్ పై పడినట్లు సమాచారం. ఆ బ్యూటీ ఎవరో కాదు టాక్సిక్ భామ కియారా అద్వానీ.

బాలీవుడ్లో అత్యధిక పారితోషికం అందుకుంటోన్న నటీమణుల్లో ఈమె ఒకరు. 2014లో ఫగ్లీ అనే చిత్రం ద్వారా కథానాయకిగా ఎంట్రీ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ.. ఆ తర్వాత పలు భారీ చిత్రాల్లో నటించి స్టార్ హీరోయిన్గా ఎదిగారు. హిందీ చిత్రాలు నటిస్తూనే టాలీవుడ్లోకి ఎంట్రీ ఇచ్చారు. అక్కడ మహేష్ బాబుకు జంటగా భరత్ అనే నేను చిత్రంతో ఎంట్రీ ఇచ్చి సక్సెస్ అందుకున్నారు. ఆ తర్వాత శంకర్ దర్శకత్వంలో రూపొందిన గేమ్ ఛేంజర్ చిత్రంలో రామ్ చరణ్తో జత కట్టారు. తాజాగా ఈమె కన్నడ చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చి టాక్సిక్ చిత్రంలో యష్కు జంటగా నటించారు. ఈ చిత్రం త్వరలో తెరపైకి రానుంది.

ఇలా దక్షిణాదిలో తెలుగు, కన్నడం ప్రేక్షకులకు దగ్గరైన కియార అద్వానీ దృష్టి ఇప్పుడు కోలీవ్పు పడినట్లు సమాచారం. ఒక తమిళ ప్రముఖ నటుడు ఈమెను కోలీవుడుకు పరిచయం చేసే ప్రయత్నంలో ఉన్నట్టు తెలిసింది. కథను కూడా చెప్పినట్లు, అందులో నటించడానికి కియారా అద్వానీ సుముఖంగా ఉన్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉంది.

# పోలీసులు నన్ను పువ్వుల్లో పెట్టుకుని తీసుకొచ్చారు



ప్రస్తుతం 'రాకా' సినిమాతో బిజీగా ఉన్న అల్లు అర్జున్.. వైజాగ్ లో కనిపించాడు. తన 'ఏఏఏ సినిమాస్' మల్టీప్లెక్స్ ని ఘనంగా ప్రారంభించాడు. హైదరాబాద్ లో ఇప్పటికే ఇలా ఓ మల్టీప్లెక్స్ ఉండగా.. ఇప్పుడు విశాఖపట్నంలోనూ లాంచ్ చేశాడు. ఈ సందర్భంగా బన్నీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఇప్పుడు వైజాగ్ రోడ్డుపై అస్సలు నడవలేకపోతున్నానని చెప్పుకొచ్చాడు. 'గంగోత్రి' రోజుల్లో వైజాగ్ రోడ్డుపై ఎవరూ నన్ను గుర్తుపట్టేవారు కాదు. ఇప్పుడు అదే రోడ్డుపై నడవలేకపోతున్నాను. 'రాకా' షూటింగ్ ముంబైలో జరుగుతోంది. వైజాగ్ ప్రజల కోసం ఒక రోజు బ్రేక్ అడిగి వచ్చాను. అయితే పోలీసులు నన్ను ఎయిర్ పోర్ట్ నుంచి పువ్వుల్లో పెట్టుకుని తీసుకొచ్చారు. వాళ్లకు థ్యాంక్స్' అని అన్నాడు. ఇక ఎదురుగా ఉన్న కొందరు అభిమానులు ఫొటో కావాలని అడగడంతో అందరూ ఇక్కడికి వచ్చేయండి అని స్టేజీపైకి ఆహ్వానించాడు. ఫ్యాన్స్ కి నో అని చెప్పటం నా వల్ల కాదమ్మా అని అన్నాడు. ఎనిమిది స్క్రీన్లు ఉన్న ఈ మల్టీప్లెక్స్లో 'పుష్ప'లో గడ్డం కింద చేయి పెట్టే పోజు ఉన్న బన్నీ బొమ్మని ప్రదర్శన కోసం ఉంచారు. అలానే అల్లు అర్జున్ కి సంబంధించిన పలు సినిమా స్టిల్స్ కూడా ఉంచారు. ఇకపోతే ప్రస్తుతం 'రాకా' చేస్తూ బిజీగా ఉన్నప్పటికీ మరోవైపు లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలోనూ తన 23వ మూవీ చేయనున్నాడు. దీని ప్రీ ప్రొడక్షన్ వర్క్ హైదరాబాద్ లో జరుగుతోంది.

## నటిగా కాదు.. భార్యగా ఆ ఛాన్స్ వదులుకున్నా: ఐశ్వర్య



షారుఖ్ ఖాన్, దీపికా పదుకొణె జంటగా నటించిన 'హ్యాపీ న్యూ ఇయర్' సినిమా 2014లో ఎంత పెద్ద విజయం సాధించిందో చెప్పనక్కర్లేదు. అయితే ఈ సినిమాలో దీపికా పాత్రకు ముందుగా ఐశ్వర్యరాయ్ బచ్చన్ ను సంప్రదించారట దర్శకురాలు ఫరాఖాన్. కానీ ఆ సమయంలో భర్త అభిషేక్ బచ్చన్ తో కూడా నటిస్తుండటం, షారుఖ్ తో ఎక్కువ కెమిస్ట్రీ సీన్లు ఉండటంతో ఆమె ఆ అవకాశాన్ని తిరస్కరించిందట. ఓ ఇంటర్వ్యూలో ఐశ్వర్య మాట్లాడుతూ.. "ఆరాధ్య పుట్టిన తర్వాత సినిమాలకు కొంత విరామం తీసుకున్నా. 'హ్యాపీ న్యూ ఇయర్' చేసి ఉంటే మంచి కంబ్యాక్ అయ్యేది. నటిగా ఆ అవకాశాన్ని వదులుకోవడం అంత సులభం కాదు. కానీ భార్యగా ఆ నిర్ణయం తీసుకున్నా" అని చెప్పింది. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. కాగా ఐశ్వర్య చివరిగా 'పొన్నియిన్ సెల్వన్'లో కనిపించింది. ప్రస్తుతం ఆమె సినిమాలకు దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీపికా విషయానికి వస్తే సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో షారుఖ్ ఖాన్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'కింగ్' సినిమాలో నటిస్తోంది. దీంతో పాటు అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కుతున్న 'రాకా' సినిమాలోనూ నటిస్తోంది.

# మహేశ్ బాబు బర్త్ డే స్పెషల్.. ఇంత సింపుల్‌గాఇచ్చారేంటి?

మహేశ్ బాబు- రాజమౌళి కాంబోలో వస్తోన్న మోస్ట్ అడ్వెంచరస్ మూవీ వారణాసి. ఇప్పటికే ఈ మూవీపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్తో బిజీగా ఉన్నారు రాజమౌళి. ఈ మూవీ వచ్చే ఏప్రిల్ 7న ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ మూవీకి సంబంధించిన క్రేజీ అప్డేట్ వచ్చేసింది. ప్రిన్స్ మహేశ్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. ఈ మూవీలో రుద్రను పరిచయం చేస్తూ పోస్టర్ విడుదల చేశారు. రౌద్రం ఒక్కటే అతడి స్వభావం కాదు అనే క్యాప్షన్ పెట్టారు. కాగా.. ఈ చిత్రంలో మహేశ్ బాబు.. రుద్ర, శ్రీరాముడిగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు.

తాజాగా రిలీజైన ఫస్ట్ లుక్ పోస్టర్ లో మహేశ్ బాబు చాలా సింపుల్ గా కనిపించారు. పొడవైన జుట్టు, గడ్డంతో రిలీజ్ చేసిన మహేశ్ బాబు పోస్టర్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ఇది చూస్తుంటే రుద్ర పాత్ర ప్రపంచ యాత్రికుడిగా ఉండనుందని అర్థమవుతోంది. కాగా.. ఈ చిత్రంలో బాలీవుడ్ భామ ప్రియాంక చోప్రా హీరోయిన్గా కనిపించనుంది. మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస్తున్నారు.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151,
And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.